కలెక్టర్‌కు జడ్పీటీసీ వినతిపత్రం అందజేత

వాంకిడి : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన డిగ్రీ మోడల్ కళాశాల వరకు రోడ్డు సౌకర్యం, తాగునీటి సమస్య పరిష్కారం, మండల కేంద్రంలో క్రీడా మైదానానికి స్థలం కేటాయించాలని మంగళవారం కలెక్టర్ బోర్కడె హేమంత్‌రావుకు జెడ్పీటీసీ అజయ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. మండలంలో ఆటస్థలం లేకపోవడంతో యువ ప్రతిభావంతులైన క్రీడాకారులు క్రీడల్లో రాణించలేకపోతున్నారని తెలిపారు. కలెక్టర్ స్పందించి రోడ్డు సౌకర్యంతో పాటు కళాశాలలో తాగునీటి వసతి, క్రీడా మైదానానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు.



అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 22 మార్చి 2023

కౌటాలలో అకాల వర్షం

నవతెలంగాణ - కౌటాల

మూడు రోజులుగా ఉరుములు, మెరుపులతో భయపెడుతూ మంగళవారం మధ్యాహ్నం నుండి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో అకాల వర్షం భారీగా కురిసింది. వర్షంతో పాటు వడగాలలు రావడంతో మొక్కజొన్న నేలకొరిగిందని రైతులు పేర్కొన్నారు. అకాల వర్షంతో దెబ్బతిన్న మొక్కజొన్నను పరిశీలించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



నవతెలంగాణ-లక్సెట్టిపేట్

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఆరీఫ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 5,11 వార్డులలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరీఫ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.500కే సిలిండర్ ఇస్తామన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి పాటుపడేది కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని తెలిపారు. అంతేకాకుండా అధికార బీఆర్ఎస్ నాయకులు తెలంగాణలో పాలనను భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు దోచిపెడుతోందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పింగళి రమేష్, మైనార్టీ అధ్యక్షులు నవాబ్, ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ గుత్తికొండ శ్రీధర్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు చాతరాజు రాజేష్, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, సూర్యచంద్రమౌళి, కోల నాగర్జున, ఫ్రాంక్లిన్, విల్సన్ రాజు, రవి, మురళి, హజి, కోసుగంటి ప్రశాంత్, తారాచంద్, చిన్న వెంకటేష్ పాల్గొన్నారు.

26న సీపీఐ ఉమ్మడి జిల్లా సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 26న మంచిర్యాల జిల్లా నస్పూర్ న్యూ నస్పూర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేని శంకర్ కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందారం క్రాస్ రోడ్ నుండి మోటార్ బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందన్నారు. మతాన్ని అడ్డం పెట్టుకొని పరిపాలన కొనసాగిస్తున్న మతోన్మాద బీజేపీని తరిమికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం పార్టీ శ్రేణులు ఏకం కావాలని, పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం నిరుద్యోగులకు శాపంగా మారిన పేపర్ లీకేజీపై పూర్తిస్థాయి విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉపేందర్, చిరంజీవి పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ డైరెక్టర్, ఆరోగ్య మహిళా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జాన్‌బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆరోగ్య మహిళ కార్యక్రమం రిజిస్టర్లు, పోస్టర్లను పరిశీలించి మహిళలకు చేసే పరీక్షలపై స్థానిక వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు వచ్చే వ్యాధులు, గర్భాశయ క్యాన్సర్, రక్తహీనత, మూత్రకోశ సంబంధిత వ్యాధులు, లైంగిక సంబంధమైన అంటువ్యాధులు, ఇన్ఫెక్షన్స్, అసహజమైన రుతుచక్ర సమస్యలు, శారీరక బరువు మేనేజ్మెంట్ పరీక్షలు చేసి వారికి అందుబాటులో ఉన్న వైద్యం చేస్తామన్నారు. లేదంటే రెఫరల్ ఆస్పత్రులకు పంపించి పూర్తి వైద్యం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మహిళా వైద్యాధికారిణి డాక్టర్ శిల్ప, డాక్టర్ భీంరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి కష్టాలు లేకుండా చూడాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న వేసవి కాలంలో మండలంలో తాగునీటి కష్టాలు లేకుండా చూడాలని జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మల్లికార్జున్ అధ్యక్షతన మండల స్థాయి సమావేశం నిర్వహించారు. వేసవి కాలంలో ముఖ్యమైన రెండు విభాగాలు మిషన్ భగీరథ, విద్యుత్‌పై సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మిషన్ భగీరథ నీరు రాని ప్రాంతాలను గుర్తించాలన్నారు. నీరు సరఫరా కాని ప్రాంతాలను అధికారులకు తెలిపారు. వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని, లోపాలు ఎప్పటికప్పుడు సవరించుకునేలా అధికారులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఎంపీఓ ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

26న వార, పశు సంతల వేలం

కౌటాల : ఈ నెల 26న మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు మండల కేంద్రంలోని వారసంత, పశువుల సంత వేలం పాట నిర్వహించనున్నట్టు కార్యదర్శి సాయికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచ్ ఒజ్జెల మౌనీష్, ఉప సర్పంచ్ పనునూరి తిరుపతి ఆదేశాల మేరకు వేలంపాట నిర్వహిస్తున్నామని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

షడ్రుచుల సమ్మేళనం..ఉగాది పర్వదినం..!

- కొత్త సంవత్సరం పంటల సాగుపై అన్నదాతల ఆశలు
- నేటి నుంచి వ్యవసాయ పనులకు శ్రీకారం

షడ్రుచుల సమ్మేళనం..ఉగాది పర్వదినం. తెలుగు ప్రజల ప్రత్యేక పండగ. ఈ రోజు నుంచే కొత్త సంవత్సరం ప్రారంభమైనదిగా భావిస్తుంటారు. ఇంట్లో ఏ శుభ కార్యం తలపెట్టాలని భావించినా ఈ పండగ తర్వాతనే చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. వివిధ శుభ కార్యాలకు శ్రీకారం చుడుతుంటారు. మరోపక్క అన్నదాతలు ప్రత్యేకంగా భావించే ఈ పండగకు ఎనలేని ప్రాధాన్యత ఉంటుంది. ఈ రోజు నుంచి నూతన వ్యవసాయ సాగును మొదలు పెడుతుంటారు. పొలంలో విత్తనాలు వేసి, అరక దున్ని సాగును ప్రారంభిస్తారు. బుధవారం శోభాకృత నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం..



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

తెలుగు వారిలో ఉగాది పండగకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ రోజు నుంచే నూతన సంవత్సరం ఖరీఫ్ పనులను ప్రారంభిస్తుంటారు.ఈ పండగ రోజున వ్యవసాయ పనులు ప్రారంభిస్తే..మంచి ఫలితం కనిపిస్తుందని అన్నదాతలు నమ్ముతుంటారు. చాలా మంది రైతులు తెల్లవారుజామున పొలాలకు వెళ్లి పూజలు చేసి అరక దున్నడం ప్రారంభిస్తారు. గతేడాది పడిన కష్టాన్ని ..పంట నష్టాన్ని మర్చిపోయి..కొత్త సంవత్సరంలో పంట ప్రయోజనంపై గంపెడాశలు పెట్టుకుంటారు. వాస్తవానికి వర్షాలు కురిసే సమయంలో విత్తనాలు వేస్తున్నా..ఉమ్మడి జిల్లాలో మాత్రం ఉగాది పండుగ నుంచే ఖరీఫ్ పనులను మొదలు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పండుగ నుంచే రైతులు వచ్చే సీజన్‌కు సన్నద్ధమవుతుంటారు. అటు వ్యవసాయ శాఖ సైతం రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేందుకు కార్యాచరణ మొదలుపెట్టింది. ఇప్పటికే జిల్లాలో 2023లో సాగయ్యే పంటల ప్రణాళికను అంచనా వేసింది.

కిందటేడాది నష్టాలే మిగిలాయి

2022 ఏడాది అన్నదాతలకు అంతగా కలిసిరాలేదు. అధిక వర్షాల కారణంగా పంటలన్ని ఆదిలోనే తీవ్రంగా దెబ్బతిన్నాయి. పంటలు ఎదిగిన సమయంలోనూ వర్షాల ప్రభావం ఉండటంతో పూత, కాత రాలిపోయి దిగుబడిపై ప్రభావం చూపించింది. దీంతో ఎకరానికి కనీసం 10క్వింటాళ్ల పత్తి పండాల్సిన చోట 3 నుంచి 4క్వింటాల్‌లు మాత్రమే వచ్చింది. ఇంటికొచ్చిన పంటను అమ్ముకునేందుకు రైతులు అగచాట్లు పడ్డారు. మార్కెట్‌లో సరైన ధర లేకపోవడంతో ఇప్పటికీ అనేక మంది రైతులు పత్తిని విక్రయించలేని పరిస్థితి ఉంది. దీంతో రానున్న శోభాకృత నామ సంవత్సరంపై అన్నదాతలు అనేక ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏడాది వ్యవసాయం కలిసి రావాలని ఆకాంక్షిస్తున్నారు. అనేక ఆశలతో పంటల సాగుకు శ్రీకారం చుడుతున్నారు.

షడ్రుచుల సమ్మేళనం..!

ఉగాది పండుగ అంటేనే షడ్రుచుల సమ్మేళనం. జీవితంలో అన్నింటిని సమానంగా స్వీకరించాలనే భావన ఈ ఉగాది పచ్చడిలో ఉంటుంది. ప్రతి ఇంట్లో తీపి, కారం, చేదు, వగరు, పులుపు, ఉప్పుతో తయారుచేసిన పచ్చడిని తయారుచేసి సేవిస్తారు. మరోపక్క పంచాగ శ్రవణం వినడం ఆనవాయితీగా వస్తోంది. పెండ్లీలు, ఇతరాత్ర శుభ కార్యాలు కూడా ఉగాది పండగ తర్వాతి రోజు నుంచే మొదలు పెడతారు. తెలుగు ప్రజలు ఈ పండుగను ప్రత్యేకంగా భావించడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ

- నవతెలంగాణతో ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

నేరాల నియంత్రణలో ప్రజల సహకారం అవసరం. వారిచ్చే సమాచారం ఆధారంగా మరింత కట్టడి చేసేందుకు అవకాశం ఉంటుంది. జాతీయ రహదారిపై మరింత భద్రత కల్పించేందుకు జిల్లా సరిహద్దు వరకు ఆర్మీ సిబ్బందితో జిల్లా సరిహద్దు వరకు నిరంతరం పెట్రోలింగ్ ఏర్పాటు చేశామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలుపుతూ నవతెలంగాణతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాలో నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు, గొలుసు దొంగతనాలు, మహిళలపై వేధింపుల నివారణ తదితర అంశాలపై వివరించారు.

నేరాలను నియంత్రణకు చర్యలు

జిల్లాలో గతేడాది కంటే నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. రానున్న రోజుల్లోనూ గణనీయంగా తగ్గించేందుకు పోలీసుశాఖ ద్వారా కృషిచేస్తున్నాం. జాతీయ రహదారిపై భద్రతను పెంచేందుకు 40మందితో కూడిన రెండు ఆర్మీ బృందాలను



రంగంలోకి దించాం. పెన్‌గంగా నుంచి నిర్మల్ జిల్లా సరిహద్దు వరకు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తుంటాయి. దొంగతనాల నివారణ కోసం పోలీసు పెట్రోలింగ్‌ను పెంచాం. తాజాగా జరిగిన గొలుసు దొంగతనాలపై దృష్టిసారించాం. ఈ కేసును చేదించేందుకు మూడు బృందాలను ఏర్పాటుచేశాం. మరోపక్క గంజాయి, మాదకద్రవ్యాల నిరోధంపై ప్రత్యేక దృష్టిసారించాం. ఇటీవలే రెండు క్వింటాళ్ల గంజాయిని స్వాధీనంచ చేసుకున్నాం. రవాణా చేస్తున్న వ్యక్తులను కూడా గుర్తించి కేసు నమోదు చేశాం.

పోలీసులకు సమాచారం అందించాలి

జిల్లాలో ఎక్కడైనా ఏదైనా సంఘటన జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. అనుమానిత వ్యక్తులు కనిపించినా, మరేదైనా అనుమానంగా అనిపించినా వెంటనే పోలీసులకు చెప్పడం లేదంటే డయల్ 100కు ఫోన్ చేయాలి. ఐదు నిమిషాల్లో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుంటారు. ఇందుకు ప్రజల సహకారం చాలా అవసరం ఉంటుంది. ముఖ్యంగా మహిళలపై వేధింపులు అరికట్టడానికి షీటీంలు బాగానే పనిచేస్తున్నాయి. వీటితో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు సైతం కృషిచేస్తున్నాం. డ్రంకన్‌డ్రైవ్‌లు చేపట్టడం, వాహనాల అతివేగాన్ని నియంత్రించడం, హెవీలోడ్ తదితర వాటిపై దృష్టిసారించాం. ప్రజలకు వీటిపై అవగాహన కల్పిస్తున్నాం. ఉగాది, రంజాన్, శ్రీరామ నవమి పండగలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఆయా పండగలు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

కల్లోల జీవితంలోంచి..!

- కవిత్వమై మెరిసిన రామకృష్ణ

అంకురం

పల్లెటూరులో పుట్టిపెరిగి పల్లె జీవితాన్ని అనుభవించిన కవి కవిత్వం, సాహిత్యం, అనుభూతులలో తొణికిసలాడుతుంది. ఈ అనుబంధమే కవిని నిసర్గ కవిగా, నిఖార్సయిన కవిగా మలుస్తుంది. ఈ నేపథ్యం నుంచి వచ్చిన తడి ఆరని జీవిత మూలాలని మోసుకొస్తున్న కవే మన కంది రామకృష్ణ.

కంది రామకృష్ణ ఆదిలాబాద్ జిల్లాలోని తలమడుగు మండలం అర్లి(కె) గ్రామంలో 1980లో జన్మించాడు. తండ్రి నర్సన్న తల్లి లక్ష్మీ. దిగువ మధ్య తరగతి కుటుంబం. చిన్నప్పుడే తల్లినిపోగొట్టుకున్న మనిషి బాల్యం ఎంత దు:ఖ భరితమో అనుభవించిన వారికే తెలుస్తుంది. పసి వయసులోనే తండ్రి కష్టం కంఠార చూసినవాడు. రామకృష్ణ ఎంఎస్సీ, డీఈడీ, బీఈడీ పూర్తి చేసి ప్రభుత్వ ఉపాధ్యాయునిగా స్థిరపడ్డాడు. చిన్నప్పటినుంచే బాధనైన, సంతోషాన్నైనా భిన్నంగా ఆలోచించడం చూసిన ప్రతి దృశ్యాన్ని కళాత్మకంగా పరిశీలించడం రామకృష్ణకు సహజంగా అబ్బిన అభిరుచి. రామకృష్ణ లేత పాదాలు పల్లెటూరి వాగులో, వంకల్లో చుట్టూ అడవిలో, గలగల పారే సెలయేళ్ల మధ్యన గట్టి పడ్డాయి. ఆ అడుగులే జీవితాన్ని అన్వేషించుకుంటూ ఆదిలాబాద్‌కు చేరుకున్నాయి. అతని హృదయమార్ధవాన్ని పసిగట్టిన అతని డైట్ కాలేజీ లెక్చరల్, ప్రముఖ నవలారచయిత వసంతరావు దేశ్‌పాండే రామకృష్ణ కవిగా ఎదగడానికి తొలిమెట్టు. గొప్ప అవకాశం. ఇంతగొప్ప గురువు దొరకడం ఉదారి నాగదాసు స్మారక కవి సమ్మేళనం కవితల పోటీలో ప్రారంభం నుంచీ(2000-2001) దేశ్‌పాండే సర్ వాళ్ల డైట్ విద్యార్థులను బండల నాగాపూర్ తీసుకొస్తుండే వారు. ఆ విద్యార్థుల్లో కంది రామకృష్ణ చాలాసార్లు మొదటి రెండో బహుమతి గెలుచుకున్నాడు. అంటే అతని కవిత సభికులకు అంతబాగా నచ్చిందన్నట్లు. మొదటి నుంచీ నేటిదాకా తన శ్రేయోభిలాషులపై గురువులపై రామకృష్ణకు అంతులేని గౌరవం. ఆ గౌరవం మనిషి తనమే ఇతన్ని మంచికవిగా, మనసున్న కవిగా మలిచింది. రామకృష్ణ తన కవితా ప్రస్థానం తనకు దూరమైన అమ్మ కవితనుంచే మొదలైంది. పొద్దుతూరువు దిక్కు పొడవకముందే అవ్వ ముగ్గు అలికిన వాకిట్లో హరివిల్లై విరిసేది / బియ్యం నాన బెట్టి సకినాలు జేస్తున్నప్పుడు/ ఇసుర్రాయి బడక తలుపులు తీసి / ముత్తయిదువయ్యేది" అంటూ అమ్మ చేసిన బతుకు సమరాన్ని మనముందు హృద్యంగా చిత్రీకరించాడు. రామకృష్ణ తాను పుట్టి పెరిగిన ఊరు నుంచి ఒక్క పల్లె జ్ఞాపకాలనే మోసుకొనిరాలేదు. తాను జీవితాన్ని అర్థం చేసుకున్న క్రమంలో ఆధునిక కవితా వస్తువులనే స్వీకరించాడు. అద్భుతమైన వచన కవితా శిల్పిగా మలిచాడు. తెలంగాణ ఉద్యమం తీవ్ర రూపం దాల్చినపుడు నిజాయితీ గల కవిగా స్పందించాడు. "మా బతుకులల్ల మేమే మన్ను ఓసుకున్నం/ మా ఖర్మ అనుకొని బతికినం" అరవైయ్యేండ్ల సమైక్యాంధ్రుల పాలనలో మన పాలకుల నిర్లక్ష్యము అభివృద్ధి అభివృద్ధిపై దృష్టిలేకపోవడమూ కారణమని స్పష్టంగా చెప్పిండు. ప్రజల నిరాసక్తతను తెలియజేసిండు. ఇకనుంచి సోయితో బతుకుతామని గుర్తుకు తెచ్చుకుంటున్నాడు. రామకృష్ణ గొప్ప భావుకుడు ఆ భావం ఆవేదననే కాదు ఆ క్రోశాన్ని వెళ్లగక్కేనైజం రామకృష్ణకు ఉన్నది. సమాజంలోని ప్రతి వర్గాన్ని సున్నితపుతాసులో తూకంవేసి చూస్తాడు. " అందుకే పేదవాళ్ల గురించి రాసినా, రైతు గురించి రాసినా అతని వాక్యాలు మన హృదయాలను కన్నీటిమయం చేస్తాయి. కవి ఒక నిర్దిష్టమైన దృక్పధాన్ని స్థిరపరుచుకుని కవితాలోకంలో పయనిస్తున్నపుడు కచ్చితంగా అతనికి దు:ఖం బాధ, కష్టాలు, కన్నీళ్లతాలుకూ కవితా వస్తువులే ముందు కొచ్చిచూస్తాయి. ఇక్కడవలస కార్మికుల గురించి "గెలుస్తామన్న భరోసాతో/వెనక్కి చూడకుండా/వెళు న్న మనుషుల గుంపులంటూ" చావు చివరంచుదాకా వచ్చినా వాళ్లలో ఉన్న కొండంత ఆత్మవిశ్వాసాన్ని ఉద్వేగభరితంగా వర్ణించాడు. ఇతను తన పల్లె జీవితంలో చూసిన దృశ్యాలను తనకు జరిగినట్టుగా దానిలో లీనమై గొప్ప కవితలల్లాడు. ఊర్లలో పెండ్లీలు, పేరంటాలకు మంచి చెడుకు అన్నిటిలో పాలు పంచుకునే డప్పు వాద్యకారుల గురించి బాజాకళాకారుల ప్రతిభను సహజంగా చిత్రించిండు. "నీ సాగనంపులో నేను బాయకాన్నయి/ ఊరవతలికి దాటిస్తని/ పటేండ్ల కొట్టంలో బోర్లేసిన చెంబు/ నాయన పెదాలను తాకినపుడల్లా పంచభూతాల్ని కులం లెక్కన పంచుకుంటారేమోనన్న భయం" అని గ్రామీణ జీవితంలో దళితుల దీనస్థితి గురించి చెప్తాడు. రాబోయే కాలంలో కుల వివక్ష గురించి అంచనా వేసి చెప్తాడు. ఈ విధంగా రామకృష్ణ ఇదీ అని కాకుండా ఎదురించిన ప్రతి సంఘటనని కవితగా



మలిచే శిల్ప నైపుణ్యం సాధించుకున్నాడు. ఒక్కొక్క సారి తానే స్వయంగా పాట రాసి స్వయ గొంతుతో పాడి సభను రంజింపజేస్తాడు. ఎందరో సమాకాలీన కవులు జానెడు రాసి మూరెడు పేరు కోసం పాకులాడుతూ చిల్లర రాజకీయాలు చేస్తున్న కాలంలో ఇతను ఎన్నడూ పేరు కోసం, గుర్తింపు కోసం పాకులాడలేదు. అడవి మల్లెలాగ తాను మూలకున్నా తన కవితా సుగంధాలు నలుదిక్కుల వెదజల్లుతూనే ఉంటాయి. ఇదే నిజమైన కవి లక్షణం.

రామకృష్ణ ఆదిలాబాద్‌లో వచన కవితం రాసే పిడికెడు మంచికవులలో ఒకడు. రెండు దశాబ్దాలుగా కవిత్వం రాస్తూ కాలాన్ని రికార్డు చేస్తున్నాడు. కానీ తన కవితలను పుస్తకంగా అచ్చు వేయలేక పోతున్నాడు. ఈ కవి పుస్తకం కోసమే ఆదిలాబాద్ సాహితీలోకం ఎదురు చూస్తున్నది.

డా॥ ఉదారి నారాయణ
9441413666

న్యాయం చేయాలని మృతదేహంతో రాస్తారోకో



నవతెలంగాణ-దండేపల్లి

ప్రేమ పేరుతో వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్న కొత్త మామిడిపల్లి గ్రామానికి చెందిన సాయిష్మ కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు మంగళవారం మేదరిపేట ప్రధాన రహదారిపై బైటాయించారు. అదే గ్రామానికి చెందిన యువకుడు నలిమెల వినయ్ వేధించడం వల్లే పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని బంధువులు, కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతికి కారణమైన వినయ్‌ని కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించబోమని భీష్మించుకుని అక్కడే కూర్చున్నారు. ఆందోళనతో రోడ్డు కిరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న లక్షెట్టిపేట సిఐ కృష్ణారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని నిందితునిపై చర్యలు తీసుకొని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రాస్తారోకోతో వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ఎస్ఐ సాంబమూర్తి ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను నియంత్రించారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-తాండూర్

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మంగళవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళల ఆరోగ్యం, వైద్యం పట్ల ప్రభుత్వం శ్రద్ధ వహిస్తుందన్నారు. మహిళలు రక్తహీనతతో బాధపడకూడదన్న ఉద్దేశంతో ఉచితంగా న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తుందని తెలిపారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు పాటుపడుతోందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలుగింటి ఆడపడుచులకు పెండ్లి కానుకగా కల్యాణలక్ష్మి షాదీముబారక్ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. మహిళలు విద్య ఉద్యోగ రంగాల్లో స్థిరపడేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. అందుకుగాను కస్తూరిబా, గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, జెడ్పిటిసి బానయ్య, సీనియర్ నాయకులు పురుషోత్తంగౌడ్, దత్తాత్రేయరావు, మహేందర్‌రావు, యువజన నాయకులు బోడ సతీష్, ఎంపీటీసీలు, సర్పంచులు, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో గిరి పుత్రునికి బంగారు పతకం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న ఎ.అశోక్ పరుగుపందెంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి మణెమ్మ, ప్రధానోపాధ్యాయుడు ధర్మరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు మధుసూదన్ విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 19న హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో అండర్-10 వయస్సు వారికి ప్రోస్పోర్ట్స్ 100 వారు నిర్వహించిన స్ప్రింట్ ఛాంపియన్షిప్-2023లో 80 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, రూ.5000 ప్రోత్సాహక బహుమతి పొందినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విద్యార్థి ప్రతిభ కనబరచడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. విద్యార్థి ఘనత సాధించడానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయున్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎసిఎంఓ ఉద్ధవ్, ఎటిడిఓ క్షేత్రయ్య, జిసిడిఓ శకుంతల పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ జిల్లాలో స్వల్ప భూకంపం

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 9.30 గంటల సమయంలో పోచమ్మ గుడి వద్ద స్వల్పంగా భూమి కంపించినట్టు స్థానికులు తెలిపారు. భూకంపం రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

కౌటాల : మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 8.40 గంటలకు రెండు సెకన్ల పాటు భూమి కంపించింది. ఇండ్లలో ఉన్న వారికి భూమి కంపించిన శబ్దం రావడంతో ఒక్కసారిగా ఇండ్ల నుండి బయటకు వచ్చారు.

బెజ్జూర్: మండలంలో మంగళవారం ఉదయం 8.43గంటలకు ఒక సెకను పాటు భూమి కంపించినట్టు మండల వాసులు తెలిపారు. ఒకేసారి భారీ శబ్దం వచ్చి సెకను పాటు భూమి కంపించిందని పేర్కొన్నారు. దీంతో మండల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గత సంవత్సరం రెండు సెకన్ల పాటు కంపించిన భూమి ఈ సంవత్సరం కూడా మళ్లీ కంపించడంతో ఏం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చింతలమానపల్లి: మండల కేంద్రంతో పాటు బాబాసాగర్ డబ్బా తదితర గ్రామాల్లో మంగళవారం ఉదయం 8:30 నిమిషాల సమయంలో రెండు సెకండ్ల పాటు భూమి కంపించింది. దీంతో పలు ఇండ్లలో ఉన్న వంట పాత్రలు కిందపడ్డాయి. ఇండ్లపై ఉన్న రేకులు పెద్ద శబ్దం చేయటంతో ఇండ్లలో ఉన్నవారు భయాందోళనకు గురయ్యారు. బాబాసాగార్ గ్రామంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గదిలో ఉన్న విద్యార్థులు భూమి కంపించడంతో భయంతో బయటకు పరుగులు తీశారు.

చికిత్స కోసం ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని రంగపేట్ (బీర్నంది) గ్రామానికి చెందిన పొలాస రవి బ్రెయిన్ ట్యూమర్‌తో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా మంగళవారం ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ మిత్రుల బృందం ఆధ్వర్యంలో బాధితుని స్వగ్రామమైన రంగపేట గ్రామానికి వెళ్లి చికిత్స కోసం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీర్నంది గ్రామ సర్పంచ్ సువర్ణ లక్ష్మణరావు, జన్నారపు శంకర్, కథలాపురం ప్రవీణ్, వేల్పుల నవీన్, కొప్పుల రాజేష్, జక్క పరిమల్, దాత్రుక లక్ష్మణ్, గాజుల శ్రీనివాస్, రాచమల్ల భద్రయ్య, గట్ల రవికుమార్, బత్సాస్ శేఖర్, బాదావత్ అమర్ సింగ్, జక్కుల నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

ఏమాయికుంట సర్పంచ్ జాదవ్ లఖన్‌కు ఉత్తమ అవార్డు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ఏమాయికుంట సర్పంచ్ జాదవ్ లఖన్‌కు నేషనల్ పంచాయతీ అవార్డు వరించింది. పంచాయతీలో గత నాలుగు సంవత్సరాలుగా హరితహారం, సీసీరోడ్లు, అవెన్యూ ప్లాంటేషన్, పల్లె ప్రకృతి వనంతో పాటు వివిధ పనిలో వంద శాతం అభివృద్ధి పనులు చేయడంతో ప్రభుత్వం ఆయనకు ఈ అవార్డుకు ఎంపిక చేసింది. బుధవారం ఉగాది పండగ రోజున జిల్లా కేంద్రంలో ఆయనకు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఈ అవార్డును అందచేయనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆయనకు ఉత్తర్వులు అందినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ లా చదువు చదివిన తాను పేద ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో తనకు సర్పంచిగా ఎన్నిక చేశారని అన్నారు. పంచాయతీ ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ ప్రజల మౌలిక సదుపాయాల అభివృద్ధికి తనవంతు కృషి చేయడంతో తనకు ఈ అవార్డు వచ్చిందని తెలిపారు.

శనగల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మండలంలోని పలువురు నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు నివాసంలో కలిసి విన్నవించారు. సిరికొండ సిరి సంపదల సొసైటీ ద్వారా శనగలు కొనుగోలు చేయాలని స్థానిక నాయకులు ఇటీవల విన్నవించగా, పెండింగ్‌లో ఉండటంతో స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు మళ్లీ ఒకసారి విన్నవించగా శనగల కొనుగోలు కేంద్రం ఫైల్ స్టేట్ చీఫ్ సెక్రటరీ రఘునందన్ రావుతో ఫోన్‌లో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాన్ని తొందరగా ప్రారంభించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అశోక్, సిరి సంపదల సొసైటీ చైర్మెన్ ప్రకాష్, నాయకులు సూర్యకాంత్, ఈశ్వర్, రామరావు పాల్గొన్నారు.

ఉగాది కొత్త వెలుగు నింపాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



తెలుగు సంవత్సరాదిని స్వాగతించే ఉగాది ప్రజల్లో కొత్తవెలుగులు నింపాలని మున్సిపల్ కమీషనర్ చిక్యాల రత్నాకర్ రావు అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. ఈ తెలుగు కొత్త సంవత్సరం పాడీ, పంటలతో వర్ధిల్లి రైతులు వృద్ధి చెందాలని అన్నారు. వ్యాపార, రాజకీయ, రంగాలవారు మరింత అభివృద్ధిని సాధించాలని, పేద ప్రజలంతా ఈ ఏడాదంతా సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలి కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థులు తమ, తమ రంగాలలో పేరు ప్రఖ్యాతలు సంపాధించాలని అన్నారు. ఆరు రుచులుగా పేర్కొనబడే తీపి, చేదు, వగరు పులుపు, ఉప్పు, కారం సమ్మేళనంతో చేసిన పదార్థాన్ని ఆరగించి ఉగాది పండుగను ప్రజలు సంబురంగా నిర్వహించుకోవాలని కోరారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పెందూర్ అమృత్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని రిమ్మ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కంటి వెలుగు ద్వారా కంటి పరీక్షలు చేసుకొని, ఏవైనా సమస్యలుంటే, మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. గ్రామంలో దాదాపుగా 70 మందికి పరీక్షలు నిర్వహించారు. 23 మందికి శస్త్ర చికిత్సలు చేయాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెందూర్ అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, మెడికల్ ఆఫీసర్ సంతోష్ కుమార్, సిబ్బంది వైష్ణవి, ఆనంద్‌రావు, తుర్ప బాయి, శ్యామల పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్

విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యా ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని లాల్ టేకిడి ఉట్నూర్ గిరిజన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చౌహాన్ అనిల్ సూచించారు. మంగళవారం మండలంలోని జామడ గిరిజన ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించి, పదో తరగతి విద్యార్థినులకు పాలిటెక్నిక్ విద్యా ఉద్యోగ అకాశాలు వివిధ కోర్సులపై అవగాహన కల్పించారు. కళాశాలలో చదివినా గిరిజన విద్యార్థులు అంచెల అంచెలుగా ఎదిగి ఉద్యోగంలో స్థిరపడ్డారని వివరించారు. పాలిటెక్నిక్ కోర్సును చదవడం వల్ల ఆర్థికంగా సామాజికంగా స్థిర పడటానికి మంచి అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఈ ఆధునిక కాలంలో సాంకేతిక విద్య చదివిన వారికి ఉద్యోగ అవకాశాలు అధికంగా అందుబాటులో ఉంటున్నాయని అన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నెహ్రూ, పీడీ విశ్వనాథ్, ఉపాధ్యాయులు మల్కు పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది ఉన్నారు.

గతంలో ఎన్నడూ లేనతంగా అభివృద్ధి

నవతెలంగాణ-ఉట్నూర్



గతంలో టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు పాలించినప్పటికీ అభివృద్ధి జరగలేదని కేసీఆర్ సీఎం అయ్యాక మండలాన్ని అభివృద్ధిలో ముందుంచామని ఎంపీపీ పంద్రా జైవంత్‌రావు అన్నారు. ఉగాది పండుగ సందర్భంగా ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్ నవతెలంగాణతో మాట్లాడారు. గతంలో రెండు పార్టీలు పాలించినప్పటికి అభివృద్ధి చేయలేదని అన్నారు. స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత సీఎం కేసీఆర్ దేశానికి పల్లెలే పట్టుకొమ్మలుగా తీర్చిదిద్దారని అన్నారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఇంటింటికి నల్లా నీరు, ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు, గ్రామంలో వైకుంఠ దామాలు, మీషన్ కాకతీయ ద్వారా చెరువుల మరమ్మతులు, హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటే కార్యక్రమం, రైతులకు రైతుబంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మీ, పల్లె ప్రకృతి వనాలు, మన ఊరు మన ప్రణాళిక, కంటి వెలుగు, గిరిజనులకు పౌష్టికాహారం కిట్ల అందజేత తదితర పథకాలున్నాయని అన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో తెలంగాణ ప్రభుత్వం మరింత అభివృద్ధి కోసం పనులు జరుగుతున్నాయని అన్నారు.

బడ్జెట్ సమావేశానికి కౌన్సిలర్లు గైర్హాజరు

- మూడోసారి వాయిదాపడ్డ సమావేశం



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖనాపూర్ పురపాలక సంఘం వార్షిక బడ్జెట్ సమావేశం మళ్లీ వాయిదా పడింది. మంగళవారం జరుగాల్సిన సమావేశానికి కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లతో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సైతం హాజరు కాలేదు. చైర్మెన్ మాత్రమే హాజరు కాగా, సభ్యులెవరూ హాజరు కాకపోవడంతో కమీషనర్ సమావేశాన్ని వాయిదా వేసినట్లు ప్రకటించారు. సభ్యులెవరూ రాకపోవడంతో సమావేశపు హాలులో చైర్మెన్, కమీషనర్, సింబ్బంధి కొంతసేపు కూర్చొని వెళ్లిపోయారు. కౌన్సిలర్లు హాజరుకాక వార్షిక బడ్జెట్ వాయిదా పడటం ఇది మూడోసారి కావడం గమనార్హం. సభ్యులు హాజరు కానందున మరో తేదీని ప్రకటిస్తామని కమీషనర్ రత్నాకర్ రావు తెలిపారు.

లెక్కలు చెబితేనే హాజరవుతాం : మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సత్యం

మూడెండ్ల నుంచి పట్టణంలో జరిగిన అభివృద్ధి పనులు, ఆదాయ, వ్యయానికి సంబంధించి వివరాలు చెప్పేవరకు తాము బడ్జెట్ సమావేశానికి హాజరు కామని మున్సిఫల్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని అన్నారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు అధ్వాన్నంగా మారడంతో క్షేత్రస్థాయిలో తాము ప్రజలతో చివాట్లు పడుతున్నామని తెలిపారు. అస్తవ్యస్తంగా వేసిన మిషన్ భగీరథ పైపు లైన్ వల్ల పట్టణ ప్రజలకు తాగునీరు అందించలేని వారిగా అపవాదును ఎదుర్కొంటున్నామని తెలిపారు. కౌన్సిలర్ల వేదనను అర్థం చేసుకోకుండా చైర్మెన్, కమీషనర్ బడ్జెడ్ సమావేశం నిర్వహిస్తే ఎవరూ హాజరు కారని తెలిపారు. గడిచిన మూడు సంవత్సరాల జమా, ఖర్చుల వివరాలు స్పష్టంగా చబితేనే బడ్జెట్ సమావేశానికి హాజరవుతామని తెలిపారు. ఈ క్రమంలోనే తాము గైర్హజరైనట్లు కాంగ్రెస్ కౌన్సిలర్లు కిషోర్ నాయక్, అఫ్రీన్ బేగం, ఫౌజియా, బీజేపీ కౌన్సిలర్ నాయిని శ్రవంతి తెలిపారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు షబ్బీర్ పాషా, హమానుల్లాఖాన్, నాయిని సంతోష్ ఉన్నారు.

జనచైతన్య యాత్ర సభను విజయవంతం చేయండి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్



నవతెలంగాణ-బేల

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 23న జనచైతన్య యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్ అన్నారు. మంగళవారం సిర్సన్న, డోప్టాల, గ్రామాల్లో జనచైతన్య యాత్రకు సంబందించిన పోస్టర్లను గ్రామస్తులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక ఆదివాసీ వ్యతిరేక విధానాలపై నిరసిస్తూ సీపీఐ(ఎం) రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార జాత చేస్తూ ప్రజలను చైతన్య వంతం చేస్తూ జాత నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు రాష్ట్ర నాయకులు హాజరువుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆత్రం కిష్టన్న, స్వామి, సంతోష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

జైనథ్:23న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జన చైతన్య యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్ అన్నారు. మంగళవారం మండలంలోని బెల్లూరి గ్రామంలో జన చైతన్య యాత్రకు సంబంధించిన పోస్టర్లను గ్రామస్తులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక ఆదివాసీ వ్యతిరేక విధానాలపై నిరసిస్తూ సీపీఐ(ఎం) రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార జాత చేస్తూ ప్రజలను చైతన్య వంతం చేస్తూ జాత నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు రాష్ట్ర నాయకులు హాజరువుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆత్రం కిష్టన్న, స్వామి, సంతోష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉట్నూర్ :23న జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన చైతన్య యాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్ అన్నారు. మంగళవారం స్థానికంగా జనచైతన్య యాత్రకు సంబంధించిన పోస్టర్లను నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక, ఆదివాసీ వ్యతిరేక విధానాలపై నిరసిస్తూ సీపీఐ(ఎం) రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారజాత చేస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తూ జాత నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర నాయకులు హాజరువుతున్నారని అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు, కార్మికులు, ఆదివాసులు పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆత్రం కిష్టన్న, స్వామి, సంతోష్ ఉన్నారు.

ఆలయంలో సైకో కలకలం...

- సెక్యూరిటీ కండ్లు కప్పి ఆలయంలోకి వెళ్లిన సైకో



నవతెలంగాణ-బాసర

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సరస్వతిదేవి ఆలయంలో భక్తుల భద్రతపై సందేహాలు కలుగుతున్నాయి. అమ్మవారిని దర్శించుకోవడానికి దేశం నలుమూలల నుండి భక్తులు భారీగా తరలివస్తుంటారని. మంగళవారం ఉదయం ఓ సైకో సెక్యూరిటీ సిబ్బంది కండ్లు కప్పి ఆలయంలోకి ప్రవేశించి, అమ్మవారి ఎదురుగా ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం కలకలం రేపుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనూ సైకో రెండు సార్లు ఆత్మ అత్యాయత్నానికి ప్రయత్నించగా ఆలయ సిబ్బంది అడ్డుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. అయినా ఆ వ్యక్తిలో మార్పు రాకపోవడం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటంతో ఒక్కసారిగా భక్తులు భయాందోళనకు గురయ్యారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్న సమయంలోనే కొన్ని రోజుల పాటు సెక్యూరిటీ సిబ్బంది భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. ఆలయంలో నిరంతరాయంగా భద్రతపై దృష్టి పెట్టాలని స్థానికులు భక్తులు కోరుతున్నారు. ఓ వ్యక్తి ఆలయంలోకి కత్తితో లోపలికి వెళ్లడంపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భద్రతా సిబ్బంది తమ విధులు సరిగా నిర్వహించకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సెక్యూరిటీ కండ్లు కప్పి ఆలయంలో సైకో...

సరస్వతి అమ్మవారి సన్నిధిలో మంగళవారం సైకో కలకలం సృష్టించాడు. ఆలయ సెక్యూరిటీ సిబ్బంది కండ్లు కప్పి అమ్మవారి గర్భాలయం వద్ద అమ్మవారిని దర్శించుకుంటునట్లు నటిస్తూ వ్యక్తి తన చేయి మని కట్టును కత్తితో కోసుకోవడం గమనించిన హోంగార్డ్ వాగ్దేవి సొసైటీ సిబ్బంది అతనిని వారించి గర్భాలయం నుండి బయటకు తీసుకవచ్చి ప్రాథమిక చికిత్స నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆలయ హోమ్ గార్డ్స్ సిబ్బంది తెలిపారు. నిజామాబాద్ పట్టణ కేంద్రానికి చెందిన ప్రసాద్ గౌడ్ అని గుర్తించారు. గతంలోనే రెండుసార్లు ఇలాంటి ప్రయత్నాలు చేసినా ప్రసాద్‌గౌడ్‌ను ఆలయ సెక్యూరిటీ సిబ్బంది వారించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయినప్పటికీ ఆయన తీరులో మార్పు రాకపోవడం మరోమారు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడడం కలకలం రేపుతోంది. గతంలోనే ఆయనపై నిఘా ఉంచిన ఆలయ అధికారులు సెక్యూరిటీ ఈ మారు ఆలయ గర్భాలయంలోనే ఆత్మహత్యకు ప్రయత్నించంపై భద్రత సిబ్బంది వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. భద్రతా సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటు చేసుకుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఆలయ సిబ్బంది కఠిన చర్యలు తీసుకోవాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్ పటేల్, భక్తులు కోరారు.

సిబ్బందిపై చర్యలు తప్పవు

ఆలయంలోకి కత్తితో వ్యక్తి ప్రవేశించిన సెక్యూరిటీ సిబ్బంది వైఫల్యంపై ఆలయ ఈఓ విజయరామారావు స్పందించారు. వీడియోలు పరిశీలించి సెక్యూరిటీ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు

- ఆలయ ఈఓ విజయరామారావు

పుర ప్రజావాణిలో అధికారుల అలసత్వం



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణ పౌరుల సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేకంగా రూపొందించిన పుర ప్రజావాణిలో సంబంధిత అధికారుల అలసత్వం స్పష్టంగా కనబడుతోందని పలువురు ఆరోపించారు. వారంలో ఒకరోజు ప్రత్యేకంగా కేటాయించబడిన రోజు కావడంతో అర్జీదారులు ఎన్నో ఆశలతో మున్సిపల్ కార్యాలయానికి వచ్చి తమ అర్జీలను అందజేస్తారని పేర్కొన్నారు. అయితే మంగళవారం ఉదయం 10:30 గంటల నుండి 1.30 గంటల వరకు కొనసాగాల్సిన పుర ప్రజావాణి మంగళవారం మాత్రం ఏకంగా 11 గంటల 15 నిమిషాల తర్వాతే కమిషనర్ ఏ.శైలజ రాకతో మొదలైందని పేర్కొన్నారు. అంతకుముందే సమస్యలను నివేదించడానికి అక్కడికి చేరుకున్న అర్జీదారులకు చాలాసేపటి వరకు నిరీక్షణ తప్పలేదని వాపోయారు. సమయానికి కేవలం మున్సిపల్ మేనేజర్, పుర ప్రజావాణి విభాగాధికారి మినహా ముఖ్యమైన అధికారులు ఎవరూ కనిపించకపోవడం పుర ప్రజావాణి కొనసాగుతుందో లేదోనని ఆందోళన చెందారు. అంతకుముందు చాలాసేపు అధికారుల కుర్చీలు ఖాళీగా దర్శనం ఇవ్వడంతో కొందరు అర్జీదారులు సైతం వెనుదిరిగారు. అనంతరం కొనసాగిన పుర ప్రజావాణికి 22 అర్జీలు అందగా అందులో సానిటేషన్ విభాగం నుంచి 1, ఇంజనీరింగ్ విభాగం 3, టౌన్ ప్లానింగ్ విభాగం 4, రెవెన్యూ విభాగంకు చెందినవి 14 ఉన్నాయి. వాటిని కమిషనర్ సంబంధిత అధికారులతో మాట్లాడి వాటికి పరిష్కార మార్గాలు చూపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ దివాకర్, టౌన్ ప్లానింగ్ అధికారులు అనురాధ, సాయి కిరణ్, టెక్నికల్ అధికారి మమత, సానిటరీ ఇన్స్‌పెక్టర్ నరేందర్, పుర ప్రజావాణి విభాగాఅధికారి పెంటయ్య పాల్గొన్నారు.

సీసీ కెమెరాల అందజేత

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాల్వ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయానికి రూ.32వేల 116 విలువ చేసే సీసీ కెమెరాలను మెట్‌పల్లికి చెందిన గన్నారపు సూర్య ఆలయ కమిటీ చైర్మెన్ చిన్నయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మెన్ మాట్లాడుతూ ఇతర జిల్లావాసీ అయినా స్వామి వారి సేవలో తరించి విలువైన సీసీ కెమెరాలు అందించడం ఆనందదాయకమని అన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వెంకటేష్, ఆలయ జూనియర్ అసిస్టెంట్ మాధవ రావు, నాయకులు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు పుజారం మహేష్, సీసీ కెమెరా నిర్వాహకులు సాయి పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాలలో ఉగాది వేడుకలు



నవతెలంగాణ-ఉట్నూర్

తెలుగు నామా శోభకృత్ ఉగాది సందర్భంగా సంబరాలను కేబి ప్రాంగణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. షేద్రూచ్‌లతో తయారు చేసిన ఉగాది పచ్చడిని అధ్యాపకులకు, విద్యార్థులకు అందించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముచ్చ స్వామి మ్యాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సరం ఉగాది నుంచే ప్రారంభం అవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉగాది పచ్చడి తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సంగీత, డాక్టర్ శ్రావణి, శ్రీధర, రవి కిరణ్, శ్రీనివాస్, రవీందర్, రాజ్ కుమార్, రాజా శేఖర్, కిషన్, శ్వేతా, స్వప్న, జావిద్, దేవన్న ఉన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మరప్పగూడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావు స్థానిక సర్పంచ్ కుమ్ర యాదవ్ రావుతో కలిసి మంగళవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు సహకారంతో ఎమ్మెల్యే నిధులతో రూ.3 లక్షలతో గ్రామంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొత్తపెల్లి మల్కుగూడ, గుంజాల గ్రామానికి రూ.3 లక్షల చొప్పున నిర్మాణ పనులకు భూమిపూజ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుమ్ర న్యానేశ్వర్, ఉపసర్పంచ్ అబ్జల్ ఖాన్, పటేల్ పూసం జాలింషావ్, పూసం ఇస్రు పటేల్, హన్మంతు, సెక్కు, తొడసం గజానంద్, రాము, జంగు, తెలంగ్ రావు, జాలింషావ్ ఉన్నారు.

వర్షాలతో దెబ్బతిన్న పంటల పరిశీలన

నవతెలంగాణ-పెంబి

ఇటీవల కురిసిన వడగండ్ల వానల కారణంగా నష్టం వాటిల్లిన పంట పొలాలను ఖానాపూర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు సుజాత క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు. మంగళవారం ఇటిక్యాల, పసుపుల, పులగం పాండ్రి, హరిచంద్ తండా గ్రామాలలో పర్యటించి, రైతులతో మాట్లాడారు. పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఈ అకాల వర్షాల కారణంగా పంటలలో తెగుళ్ల ఉధృతి ఎక్కువ అయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందు జాగ్రత్తగా లీటరు నీటికి 1 గ్రాము కార్బెండిజం కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజ్ కుమార్, రైతులు రవీందర్, సురేందర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషన్ పక్వాడ

నవతెలంగాణ-దిలావర్‌పూర్



నర్సాపూర్(జి) మండల కేంద్రంతో పాటు తురాటి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, బాలికల సమైక్య సంఘ అధ్యక్షురాలు ఆవుల సరిత మాట్లాడుతూ చిరుధాన్యాలపై గర్భిణులు, పాలిచ్చే తల్లులు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని మహిళలు, బాలబాలికలు ఆరోగ్య పరంగా ఎల్లవేళలా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, ఉపసర్పంచ్ లక్ష్మణ్, వీఓఏ నారాయణ, డీఎల్ఓ కరుణ, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు, బాలింతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాంసి:మండలంలోని గొట్కూరి భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ పక్వాడ పక్షం కార్యక్రమంలో బాగంగా గర్భిణీ మహిళలకు, బాలింతలకు, పోషక చిరుధాన్యలపై ఐసీడీఎస్ సీడీపీఓ నర్సమ్మ గ్రామ సర్పంచ్‌తో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 20 తేదీ నుండి ఏప్రిల్ 3వ తేదీ వరకు పోషన్ పక్వాడ పక్షం కార్యక్రమంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, పోషక ఆహారం తినాలని అన్నారు. చిరు ధాన్యాలు తినడం వల్ల అనేక రకాల పోషక పదార్థాలు లభిస్తాయి అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే అన్ని రకాల పోషక విలువలు గల ఆహారం అందించడం జరుగుతుందని అన్నారు. తప్పకుండా తమ పిల్లలకు పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేమ కల్యాణి, సూపర్‌వైజర్ ముంతాజ్, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు, వెంకటమ్మ లక్ష్మి, సుజాత, కవిత, కిస్టమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రేమ పేరుతో లొంగదీసుకొని ఆదివాసీ యువతి మృతికి కారణమైన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆదివాసీ భారత్ మహాసభ ఉట్నూర్ డివిజన్ అధ్యక్షురాలు పెందూర్ ప్రియాంక డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కుమురం భీం అసిఫాబాద్ జిల్లాలో కెరమెరి మండలం అగుర్‌వాడకి చెందిన ఆదివాసీ యువతి జుగ్నాక రేణుక ఉద్యోగం కోసం నిర్మల్ జిల్లాకి వచ్చి ఉద్యోగం చేస్తుందన్నారు. ఆదివాసీ యువతికి ఓ వర్గానికి చెందిన రమేష్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో మోసం చేసి పెండ్లి కాకుండానే గర్భవతి చేసి హత్య చేసి ఉంటాడని ఆరోపించారు. ఆదివాసీ యువతి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఈ సంఘం మహిళ నాయకురాలు ఉన్నారు.

ఇంటర్ పరీక్షల్లో 8 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో మంగళవారం రెండో సంవత్సరం మూడో రోజు కొనసాగిన ఇంటర్ పరీక్షల్లో 269 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా అందులో 8 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఉదయ్ కుమార్ కళాశాల ఇన్‌ఛార్జి బాలాజీ కాంబ్లే పేర్కొన్నారు.

భూరుగుపల్లిలో ఎద్దుల పోటీలు

నవతెలంగాణ-భీమారం

మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన రైతులు తెలుగు ఉగాది సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం ఎద్దుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో చుట్టుపక్కల గ్రామాల రైతులు తపడ్డారు. ఈ పోటీల్లో బూర్గుపల్లి గ్రామానికి చెందిన చెన్నూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూక్య రాజ్‌కుమార్ నాయక్ మొదటి బహుమతి కైవసం చేసుకోగా, నస్పూర్ పట్టణానాకి చెందిన మాతె శ్రీను ద్వితీయ బహుమతి గెలుపొందారు. అదేవిధంగా పాత బెల్లంపల్లికి చెందిన భుక్య సమ్మయ్య మూడవ బహుమతి సొంతం చేసుకొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు అందజేశారు. కార్యక్రమంలో భూక్య రాజు నాయక్, దరావత్ శంకర్ నాయక్, భూక్య దాత్రు నాయక్ సమ్మయ్య నాయక్, విరేసు పెండ్యల సురేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు భుక్య రమేష్, సమ్మయ్యలు, దసురు నాయక్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు రాజేష్ నాయక్, మాజీ జడ్పీటీసీ జర్పుల రాజ్‌కుమార్ నాయక్, శేఖర్, శంకర్, దేవ్ నాయక్ సాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో జిల్లా విద్యాధికారి అశోక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అందిస్తున్న ప్రోత్సాహాన్ని ఆసరాగా చేసుకుని విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే ఆలోచనలు ఉన్నతంగా ఉండాలని తెలిపారు. విద్యార్థి దశలో పదవ తరగతి అత్యంత కీలకమైనదని మంచి ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను మొదటి నుండి ఆ దిశగా ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు తిలకించి, పాఠశాలలో వసతులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్, పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయ్ బాబు, పీఈటీలు లక్ష్మణ్, సంతోష్ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-నస్పూర్

ప్రతి వ్యక్తికి కిడ్నీలు అత్యంత ఆవశ్యకమైన అవయవమని వాటి వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసం ఎంతైనా ఉందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. ప్రగతి స్టేడియంలోని సిఈఆర్ క్లబ్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ శ్రీరాంపూర్ ఏరియా యాజమాన్యం ఆధ్వర్యంలో డాక్టర్ పి.రమేష్‌బాబు అధ్యక్షతన మంగళవారం కిడ్నీ వ్యాధి నిర్ధారణ, నివారణ చర్యలకు సంబంధించిన అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జీఎం సేవ అధ్యక్షురాలు రాధా కుమారి పాల్గొని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణలో శ్రీరాంపూర్ ఏరియా వైద్య అధికారులు, వైద్య సిబ్బంది ఎల్లవేళలా కృషి చేస్తున్నారని అలాగే ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉంటే, సంస్థ అభివృద్ధి చెందుతుందని కావున ఉద్యోగులందరూ తమ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకొంటూ ఉండాలని సూచించారు. ఈ వైద్య శిబిరానికి విచ్చేసిన కుటుంబ సభ్యులు వారి ఆరోగ్య సంబంధిత అంశాలను ఎల్లవేళలా చూసుకుంటూ మందులను వాడాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అనేది ముఖ్యమని వ్యాధి నిర్ధారణ చేసుకుని దానికి సంబంధిత మందులను వాడాలని తెలియజేశారు. కార్యక్రమంలో తెలంగాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఎస్ఓ టు జీఎం త్యాగరాజు, డివిజన్ పర్సనల్ పి అరవిందరావు, డివై సీఎంఓ డాక్టర్ పి.రమేష్‌బాబు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి, వత్తి శిక్షణ కేంద్రం ఇంఛార్జి రాజేంద్రప్రసాద్, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్



నవతెలంగాణ ఆసిఫాబాద్


జిల్లా కేంద్రంలో అనుమతులు లేకుండా వేస్తున్న అక్రమ వెంచర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ మండలంలోని బీడీపీపి, ఇనాం భూములు కబ్జా చేసుకుని లేఅవుట్ల రూపంలో అక్రమ వెంచర్లు వేసి బాండ్ పేపర్ల ద్వారా అమ్ముతున్నారని అన్నారు. ఆసిఫాబాద్ మండలంలో గల గ్రామ పంచాయితీలు లక్ష్యం చేసుకొని అంకూసాపూర్, జండాగూడ, బూరుగూడ, సందీప్‌నగర్, రవిచంద్ర కాలని, గుండిరోడ్డు, గొడెల్లి, భాగ్యనగర్, తారక్‌రామ్‌నగర్, రాజుర గ్రామల్లో ఎక్కువగా అక్రమ ప్లాట్లు, వెంచర్లు భూకబ్జాలు కొనసాగుతున్నాయన్నారు. రాజంపేట పరిధి అటవీశాఖ చెక్ పోస్ట్ వద్ద ప్రభుత్వ బీడీపీపీ భూమిలో వెంచర్లు వేసుకొని భవనాలు పూర్తి చేశారన్నారు. అంకుసాపూర్ శివారు, నూతన ఎస్పీ భవనం వెనకాల ఇనాం భూమితో వెంచర్లు వెసుకున్నారన్నారు. జెండాగూడ, బాగ్యనగర్ శివారులో లేఅవుట్లు లేకుండా వెంచర్లు వేశారన్నారు. తక్షణమే స్పందించి తనిఖీ చేసి అనుమతులు లేకుండా ప్రభుత్వ బీడీపీపీ భూములు ఇనాం భూమిలో వెంచర్లు వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, గెడం టికనంద్ పాల్గొన్నారు.

కబ్జా భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని సింగరాయపేట చెరువు భూములను తపాలాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు అధికార పార్టీ నాయకులు కబ్జా చేశారని ఆ భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని చింతాగుడా పీఏసీఎస్ వైస్ చైర్మన్ కమ్మల విజయ ధర్మ అన్నారు. మంగళవారం మండలంలోని తపాలాపూర్ గ్రామపంచాయతీలో అఖిలపక్ష పార్టీల నాయకులతో ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరాయపేట ఊర చెరువులో ఏడు ఎకరాల 20 గుంటల ప్రభుత్వ చెరువు భూమిని ఇద్దరు అధికార పార్టీ నాయకులు కబ్జా చేసుకొని, వారి కుమారుల పేరిట పట్టా చేసుకొని రైతుబంధు, బ్యాంకులో లోన్లు తీసుకున్నారన్నారు. వారిపై రెవెన్యూ అధికారులు చర్య తీసుకొని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తుల తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనియెడల ఈ నెల 24వ తేదీన గ్రామంలో రాస్తారోకో నిర్వహించి అనంతరం వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు గుంటూకు కొమురయ్య, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అంబడిపల్లి మహేష్, మామిడి జగన్, గుంటుకు నాగేష్, బండి రాజన్న, ఆకుల సత్యనారాయణ, వీరయ్య నాగమల్లు, సుంకరి వంశీ, రాకేష్, సత్తయ్య, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బోయపల్లిలో పోషణ పక్వాడా కార్యక్రమం



నవతెలంగాణ-తాండూర్

మండలంలో బోయపల్లిలో మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలతో ర్యాలీ నిర్వహించి చిరుధాన్యాలు, తృణధాన్యాల వాడకం కలిగే లాభాల గురించి వివరించారు. కోవిడ్ నేపథ్యంలో అధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. గర్భిణీలు రోజువారి ఆహారంలో అధిక పోశకవిలువలు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. సులువుగా జీర్ణమైయ్యే తాజాకూరగాయలు ఆకుకూరలు రోజువారీ ఆహారంలో వాడాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పూలవతి, శాంత పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి నిధుల మంజూరు

- నియోజకవర్గంలోని రోడ్లకు మహర్దశ
- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో గ్రామీణ గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా వరద నష్టం కింద వివిధ గ్రామాలకు రోడ్ల సౌకర్యం కోసం నిధులు మంజూరైనట్లు బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాండూర్ మండలంలో నర్సాపూర్ ఎస్టీ కాలనీ రోడ్ నుంచి బెజ్జల కాలనిలో బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరైనట్లు తెలిపారు. నెన్నెల్ మండలంలోని మల్లారం నుంచి బిచ్చయ్యపల్లి వరకు బీటీ రోడ్డుకు రూ. కోటి 50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అదేవిదంగా కొన్నాపేట నుంచి బోగంపల్లి, బీటీ రోడ్డుకు రూ.కోటి మంజూరయ్యాయ తెలిపారు. వేమనపల్లి మండలంలోని జిల్లెడ గ్రామపంచాయతీలో బీటీ రోడ్డుకు రూ.ఒక కోటి 50 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. నెన్నెల మండల కేంద్రం నుంచి హెడ్ క్వార్టర్ నుంచి జంగల్‌పేట రోడ్డును దమ్మిరెడ్డిపేట్ కలుపుతూ జంగల్‌పేట వరకు బీటీ రోడ్డు కోసం రూ.కోటి రెండు లక్షలు మంజూరైనట్లు తెలిపారు. భీమిని మండలంలోని నారాయణరావు గ్రామం నుండి ఎల్లరం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయఅన్నారు. కన్నెపల్లి మండలం జనకపూర్ నుండి నాయకపుగూడ వయ సోనాపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.70 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. భీమిని మండలంలోని వీరాపూర్ రోడ్డుకు రూ.78 లక్షలు మంజూరైనట్లు వివరించారు. తాండూర్, బెల్లంపల్లి మండలాలను కలుపుతూ చాకపెల్లి నుంచి కాసిపేట వరకు బీటీ రోడ్డు వేయడానికి రూ.రెండు కోట్ల 30 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. తాండూరు మండలంలోని చౌటపల్లి నుండి పోచంపల్లి వరకు బీటీ రోడ్డుకు రూ.73 లక్షలు మంజూరైనట్లు తెలిపారు మొత్తం 22.20 కోట్లతో బెల్లంపల్లి నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి నిధులు ఖర్చు చేయనున్నట్లు ఆయన వివరించారు. విలేకరుల సమావేశంలో ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, జడ్పీటీసీ బాలయ్య సీనియర్ నాయకులు పురుషోత్తం గౌడ్, దత్తు మూర్తి పాల్గొన్నారు.

మనుధర్మాన్ని అమలు చేస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు అల్లూరి లోకేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పేద బడుగు బలహీన వర్గాలకు ఉపయోగకరంగా ఉన్న రాజ్యాంగం స్థానంలో మనుధర్మాన్ని అమలు చేయడానికి ప్రయత్నిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటి సభ్యుడు అల్లూరి లోకేష్ అన్నారు. సీపీఐ(ఎం) ఈ నెల 24న చేపట్టనున్న జన చైతన్య యాత్రకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక పార్టీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బానిసయుగం నాటి పరిస్థితులను మోడీ ప్రభుత్వం మళ్లీ తీసుకువస్తుందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలన దేశానికి, ప్రజలకు ప్రమాదకరమన్నారు. బీజేపీ నుంచి దేశాన్ని రక్షించడమే లక్ష్యంగా జనచైతన్య యాత్రను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అభ్యుదయ, ప్రగతిశీల భావాలున్న తెలంగాణలో మతోన్మాద బీజేపీకి తావులేదని, మత రాజకీయాలను ప్రతిఘటిస్తామన్నారు. ప్రభుత్వ విధానాలతోపాటు దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ధోరణులను ప్రజలకు అర్థమయ్యేటట్టు వివరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను, సంక్షేమ పథకాల అమలుల్లో ఉన్న లోపాలను గుర్తు చేస్తామన్నారు. ముస్లింలు, క్రిస్టియన్లు, దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులకు పాల్పడుతున్నారని, విద్యా వైద్యం తోపాటు ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తు ఈడీ, సీబీఐ, కాగ్, సుప్రీంకోర్టును కూడా అధికార పార్టీకి అనుబంధ సంస్థలుగా వాడుకుంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ చేపడుతున్న జనచైతన్య యాత్ర జిల్లాలోని జైనూర్ మండలం ఆశపల్లికి 24వ తేదీన చేరుకుంటుందని, యాత్ర నాయకులకు స్వాగతం పలికి 24వ తేదీ 4 గంటలకు ఆసిఫాబాద్‌లో ప్రెస్ మీట్ నిర్వహించి, సాయంత్రం 5 గంటలకు కాగజ్‌నగర్‌లో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తిరుపతి, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు రాజేష్, డివైఎఫ్ఐ నాయకులు రాజ్ కుమార్, టీకానంద్, ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కీర్తి రమ, సెల్వట్కర్ బుద్ధు, మండల ఉపాధ్యక్షులు వేములవాడ రమేష్, జిల్లా అధ్యక్షురాలు చందేకర్ జ్యోతి, హమాలి యూనియన్ మండల కార్యదర్శి సత్తయ్య, సుధాకర్, సంతోష్, రాజేశం, సంజీవ్, దాదాజి, మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి బాలేష్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లను తనిఖీ చేసిన రామగుండం సీపీ



నవతెలంగాణ-జన్నారం

జన్నారం పోలీస్‌స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఐపీఎస్, (డీఐజీ) మంచిర్యాల డీసీపీ సుదీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్, మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డిలతో కలిసి సందర్శించి పోలీస్‌స్టేషన్‌ల మంగళవారం పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుల విధులకు సంబందిచిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రజలతో మంచి సత్సంబంధాలు కలిగి ఉండి ఇన్ఫర్మేషన్ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని, పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగే నేరాల గురించి అడిగి తెలుసుకొన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. స్థానిక పోలీసులు గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, లక్షెట్టిపేట సీఐ కృష్ణరెడ్డి, దండేపల్లి ఎస్సై సాంబ మూర్తి, జన్నారం ఎస్సై సతీష్ ఉన్నారు.

దండేపల్లి : రామగుండం పోలీస్ కమిషనర్ రేమా రాజేశ్వరి మంగళవారం దండేపల్లి పోలీస్‌స్టేసన్‌ను తనిఖీ చేవారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలతో మమేకమై విధులు నిర్వర్తించాలని పోలీసులకు సూచించారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని కేసులు పెండింగ్‌లో ఉంచవద్దని ఆదేశించారు. మావోయిస్టుల ప్రలోభాలకు ఆకర్షితులు కాకుండా పోలీసులు గ్రామాల్లో యువతకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల, డీసీసీపీ సుధీర్ రాంనాత్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, లక్షెట్టిపేట సీఐ కృష్ణారెడ్డి, దండేపల్లి ఎస్సై సాంబమూర్తి పాల్గొన్నారు.

గూడెం సత్యదేవుని ఆలయంలో పూజలు

మండలం గూడెం రమా సహిత సత్యనారాయణ స్వామి దేవాలయంలో మంగళవారం రామగుండం పోలీస్ కమిషనర్ రేమ రాజేశ్వరి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఆలయ సిబ్బంది వేద పండితులతో కమిషనర్‌కు ఘన స్వాగతం పలికారు. ఆలయ సిబ్బంది కమిషనర్‌కు స్వామివారి చిత్రపటం బహుకరించి తీర్థప్రసాదాలు అందజేశారు అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు.

సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్‌పై అవగాహనా సదస్సు

నవతెలంగాణ నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే-7 గనిపై మంగళవారం రోజున సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎం సేఫ్టీ బెల్లంపల్లి రీజియన్ జాన్ ఆనంద్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, సిమ్టార్స్ మేనేజర్ విజయ్ కుమార్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, గుర్తింపు సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డెవలప్మెంట్‌లలో సేఫ్టీ మేనేజ్మెంట్ వివరిస్తూ దాని ప్రాధాన్యత గురించి తెలిపారు. సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్‌ను అమలు చేయు విధానాన్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏరియా జీఎం సంజీవరెడ్డి వివరించారు. ప్రతి ఒక్క కార్మికుడు వ్యక్తిగత భద్రత, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని రక్షణ సూత్రాలు పాటిస్తూ ప్రమాద రహిత సింగరేణిగా ఆర్కే-7 గనికి పేరు తేవాలని అన్నారు. సింగరేణి సంస్థలో ప్రతి ఒక కార్మికుని రక్షణే సంస్థకు ముఖ్యమని తప్పని సరిగా గనిలో అందరూ రక్షణ పరికరాలు ధరించి పనులు చేపించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ సత్యనారాయణ, గని మేనేజర్ సాయి ప్రసాద్, రక్షణ అధికారి రవి శంకర్, గుర్తింపు సంఘం ఫిట్ కార్యదర్శి మేండే వెంకటి, ఏరియా సెక్రెటరీ అశోక్, ఆర్గనైజర్ సెక్రెటరీ తొంగల రమేష్, ఫిట్ ఇంజనీర్ ప్రవీణ్, అండర్ మేనేజర్లు రవీందర్, వెంకటరామ్, సంక్షేమ అధికారి శాంతన్, గని వెంటిలేషన్, ఆఫీసర్ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌కే-1ఏ గని కార్మికులను పట్టించుకోని గని అధికారులు

రామకృష్ణాపూర్ : ఆర్‌కే-1ఏ గని కార్మికుల సమస్యలు గని సంక్షేమ అధికారులు పట్టించుకోవడం లేదని ఆ గని ఏఐటీయూసీ, బీడీజీకేఎస్ పిట్ కార్యదర్శులు సురమల్ల వినయ్ కుమార్, బండారి బిక్షపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత రెండు మూడు రోజుల నుంచి కార్మికులకు క్యాంటీన్ సౌకర్యం లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, బాత్రూమ్స్ బాగా లేక కార్మికులు వ్యక్తిగత సామాన్లు పెట్టుకునే పెట్టెల దగ్గర శుభ్రం లేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా గని అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మోడల్ స్కూల్‌లో ఫేర్‌వెల్ డే వేడుకలు

నవతెలంగాణ- కాసిపేట

మండల కేంద్రంలోని కాసిపేట తెలంగాణ మోడల్ స్కూల్‌లో మంగళవారం ఘనంగా ఫేర్ వెల్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పార్టీ ఇచ్చారు. ముందుగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సరస్వతి దేవి చిత్ర పటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ ఎంఏ అలీం, తహసీల్దార్ దిలీప్ కుమార్ ముఖ్య అతిధులుగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇష్టంతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. చివరగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో మోడల్ ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య, ఎస్ఎంసీ చైర్మన్ కూకట్ల రాజేష్ పాల్గొన్నారు.

రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం వివక్ష

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణపై బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్ధన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫారెస్ట్ గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన నిధులు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. పైగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణపై విషయం చిమ్ముతూ, ప్రభుత్వాన్ని నానా ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అన్ని రాష్ట్రాల్లో విస్తరిస్తున్న సందర్భంగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీఆర్ఎస్‌ను అనగదొక్కటానికి చూస్తోందన్నారు. సీఎం కేసీఆర్‌ను ఎదుర్కొనే దమ్ములేక ఎమ్మెల్సీ కవితను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఒక న్యాయం, ఇతర రాష్ట్రాలకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను సమాన దృష్టితో చూసి నిధులను సక్రమంగా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సుతార్ వినయ్ కుమర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొట్లా రాజేష్ యాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి సిటీ మాల భరత్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ముత్యం సతీష్, శ్రీపతి బుచ్చన్న, చింతగూడ పీఏసీఎస్ చైర్మన్ నాసాని రాజన్న, ఫోన్‌కాల్ పీఏసీఎస్ చైర్మన్ శీలం రమేష్, పొన్కల్ సర్పంచ్ జక్కు భూమేష్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రియాజుద్దీన్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, జన్నారం సర్పంచ్ భూషణ వేణి గంగాధర్ గౌడ్, ఉప సర్పంచ్ జంగం రవి, నాయకులు తోకల సురేష్ రజాక్, డాన్ శీను, జాడిశంకర్, పవన్ పాల్గొన్నారు.

అధికారుల అలసత్వంపై పాఠశాల బహిష్కరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హైవే అధికారులు పాఠశాలకు కల్పించాల్సిన మౌలిక వసతులు కల్పించకపోవడంపై ఆగ్రహించిన గ్రామస్తులు విద్యార్థులను పాఠశాలకు పంపించకుండా పాఠశాలను బహిష్కరించిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని మోతుగూడ ప్రాథమికోన్నత పాఠశాల హైవే పక్కనే ఉండడంతో రహదారి నిర్మాణంలో భాగంగా పాఠశాలకు సంబంధించిన ప్రహరీ తోపాటు మరుగుదొడ్లు తొలగించారు. 16 నెలలు పూర్తయినప్పటికీ హైవే అధికారులు మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రహరి నిర్మాణంపై స్పందించకపోవడంతో విసుగు చెందిన తల్లిదండ్రులు మంగళవారం తమ పిల్లలను పాఠశాలకు పంపించలేదు. పిల్లలు పాఠశాలకు రాకపోవడానికి గల కారణాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్యను అడగగా పాఠశాలలో మరుగుదొడ్ల లాంటి మౌలిక వసతులు లేవని పిల్లలు పాఠశాలలో ఇబ్బందులు పడుతున్నారని అందుకే పంపించడం లేదని తల్లిదండ్రుల సమధానం చెప్పినట్లు వివరించారు. ఇదే విషయం తల్లిదండ్రులను అడగగా హైవే రహదారి నిర్మాణంలో భాగంగా పాఠశాలలో కూల్చివేతకు గురైన 4 మరుగుదొడ్లు, 4 బాత్రూమ్స్‌తో పాటు ప్రహరీ నిర్మాణానికి జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాధికారికి ఎంఈఓలకు వినతి పత్రాలు అందచేశామని అయినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. పాఠశాలలో 150 మంది విద్యార్థులు చదువుతున్నారని మౌలిక వసతులు లేకపోవడం ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించే వరకు తమ పిల్లలను పాఠశాలకు పంపించమని తెలిపారు. దీంతో పాఠశాలలో పనిచేసే నలుగురు ఉపాధ్యాయులు మంగళవారం పాఠశాలకు వచ్చి విద్యార్థుల కోసం ఎదురుచూశారు.

ఉద్యోగులకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-నస్పూర్

రక్షణ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం నస్పూర్ కాలనీలోని సివిల్ కార్యాలయంలో ఉత్తమ ఉద్యోగులకు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి బహుమతులను అందజేసారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో సివిల్ విభాగం వారు చేస్తున్న పనులు అభినందించదగినవని, సివిల్ విభాగం వారు రక్షణతో పనిచేస్తూ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారని, ఆయా పనులు చేసే ఉద్యోగులు వారి వారి వ్యక్తిగత రక్షణ పరికరాలను ధరిస్తుండాలని సూచించారు. అలాగే ఉత్తమ సన్మానించుకోవడం చాలా సంతోషకరంగా ఉందని తెలియజేశారు. రక్షణ వారోత్సవాల ముగింపు సందర్భంగా రామగుండం-3 ఏరియా నుండి వచ్చిన పర్యవేక్షణ బృందం వారు శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న సివిల్ విభాగం ఉద్యోగుల పని తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో డీజీఎం సివిల్ శివ రావు, డీజీఎం ఐఈడీ రామగుండం-3 ఏరియా చంద్రశేఖర్, డీవై ఎస్ఈ సివిల్ రామగుండం-3 ఏరియా రామకృష్ణ, డీవై ఎస్ఈ సివిల్ రాము, డివైఎస్ఈ సివిల్ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సివిల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత అవార్డులకు ఎంపిక

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉమెన్ ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత 2023 అవార్డుల ఎంపికకు ఈనెల 20వ తేది నుంచి 27వ తేది వరకు పట్టణ మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ జి. వెంకటనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళలకు మహిళా దినోత్సవం పురస్కరించుకొని వ్యక్తి గత, స్వయం సహాయక, చిన్న తరహా, సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, మురుగునీటి శుద్ధి, వ్యర్థాల శుద్ధికరణ, తడిపొడి చేత్తను సేకరించి వేరుచేయడం, పొడి చెత్తతో వినూత్న రీతిలో కళాకృతుల తయారీ, తడి చెత్తను ఎరువుగా మార్చి వినియోగించుట, చెత్త నుంచి సంపద తయారీ, స్వచ్ఛతపై అవగాహన కల్పించడంతో పాటు సాంకేతికత, నూతన ఆవిష్కరణ తదితర అంశాలపై ఎంపికయిన మహిళలకు జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులు అందజేయనునట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్ వసంత్ 8309960731, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ సంతోష్ 9848384948 నెంబర్లకు ఫోన్ చేయగలరని కోరారు.

జల వినియోగంపై అవగాహన ఉండాలి

నవతెలంగాణ-భీమారం

జల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని జ్యోతి వికాస సాంఘీక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పోలంపల్లి గ్రామంలోని పెరల్ ఆఫ్ ఇండియా స్కూల్ విద్యార్థులతో ర్యాలీ తీసి ప్రపంచ జల దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఇందులో బాగంగా నీరు అడుగంటి పోతున్న భూగర్భ జలాలను కాపాడుకోవడం, వృదా నీటిని వినియోగం వంటి అంశాలపై ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రంలో హెచ్ఎం డాని, జ్యోతి వికాస కో ఆర్డినేటర్ ఎమ్మి, మెంబర్ సునిత, రాజేశ్వరి, వసంత, శిరిష, స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రామన్న అవగాహనలేని మాటలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మెల్యే జోగు రామన్న అవగాహనలేని, మోసపూరిత మాటలతో మళ్లీ ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కమీషన్లకు, స్కాంలకు అలవాటుపడిన బీఆర్ఎస్ నాయకులు దర్యాప్తు సంస్థలకు భయపడుతూ నోటికి వచ్చింది మాట్లాడి ప్రజల దృష్టి మళ్లించడానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ బిజెపి చేయించిందని ఎమ్మెల్యే మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. వందల కోట్ల రూపాయల లిక్కర్ స్కాంలో కెసిఆర్ కూతురు కవిత ఇరుక్కుంటే చట్టానికి సహకరిస్తామని చెప్పి విచారణ ప్రారంభమయ్యే సమయానికి సుప్రీం కోర్టులో పిటిషన్లు వేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు వేణుగోపాల్, దినేష్ మటోలియా, జోగు రవి, ఆకుల ప్రవీణ్, లోక ప్రవీణ్‌రెడ్డి, సోమ రవి, రత్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్షణ వారోత్సవాల ముగింపు వేడుకలు

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటి మాదారం సివిల్ కార్యాలయాలు, సీహెచ్‌పీల వద్ద సివిల్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం రక్షణ వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహించారు. సింగరేణి ఉద్యోగులు ముందుగా రక్షణ ప్రతిజ్ఞ చేశారు. గోలేటిలోని సివిల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ముగింపు వేడుకలకు ఈఈ(సివిల్) రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రదేశాల్లో భద్రత అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రమాదాలను నియంత్రించడానికి రక్షణ సూత్రాలు పాటిస్తూ పరికరాలు ధరించాలని, పనులు చేయాలన్నారు. ఉద్యోగులు, వారు చేస్తున్న పనుల వారీగా పాటించాల్సిన రక్షణ సూత్రాలను వివరించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు రాజయ్య, శ్రీనివాస్, నాగేంద్ర పాల్గొన్నారు.

రమేష్‌పై హత్య కేసు నమోదు చేయాలి

నవతెలంగాణ-కెరమెరి



ప్రేమ పేరుతో ఆదివాసీ యువతికి మాయమాటలు చెప్పి గర్భవతిని చేసి మోసం చేసిన రమేష్‌పై హత్య కేసు నమోదు చేయాలని ఆదివాసీ భారత్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పెందూర్ రాజేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుటుంబ కష్టాలను తీర్చడానికి బతుకుదెరువు కోసం నిర్మల్ వెళ్లి ప్రైవేట్ ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్‌గా చేరిన రేణుకకు మాయమాటలు చెప్పి గర్భవతిని చేసిన లంబాడీ వర్గానికి చెందిన రమేష్‌పై హత్య కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళకు ఇంత అన్యాయం జరిగినప్పటికీ ప్రజాప్రతినిధులు, పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. శస్త్రచికిత్స చేస్తున్న సమయంలో రేణుక మరణించిందని, ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంతో పాటు రమేష్‌పై హత్య కేసు నమోదు చేయాలని, కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి అండగా ఉండి పోరాటం చేస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆదివాసులు కైలాష్, జలీంషా, జగ్గేరావు, సురుదవ్ వినయ్, సీతారాం పాల్గొన్నారు.

జైనూర్ : ఆదివాసీ యువతి మృతిపై ప్రభుత్వం న్యాయం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ, ఆదివాసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి ఆత్రం శంకర్, కుడిమెత విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మృతికి కారణమైన నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో మరణిస్తే పోస్టుమార్టం చేయకుండా మృతదేహాన్ని ఎలా బయటకు తీసుకొస్తారని మండిపడ్డారు. వెంటనే ఘటనపై దర్యాప్తు జరిపి మృతి చెందిన యువతి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనను చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు ఉయిక చందన్‌షావ్, కనక గంగారాం, దత్తు, లింగు, భీంరావు, ధర్ము పాల్గొన్నారు.

రుణమాఫీ చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం

- సీఎల్పీ భట్టి విక్రమార్క

నవతెలంగాణ-జైనూర్



రైతు రుణమాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం మండలంలోని జామిని గ్రామం నుండి రెండో రోజు యాత్ర ప్రారంభించి కెరమెరి మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఉదయం జామిని, బూసిమెట్ట, రాసిమెట్ట, బూసిక్యాంప్ గిరిజన గ్రామాల్లో పాదయాత్ర చేపట్టి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం కొత్త పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. అటవీ అధికారులు ఆదివాసీ గూడాల్లో ఆదివాసులు సాగుచేస్తున్న భూములను స్వాధీనం చేసుకొని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. రైతుకు రెండో పంటకు కరెంటు సరఫరా చేయడంలోనూ ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పేద ప్రజలకు ఇబ్బంది కలిగిస్తుందని తెలిపారు. నిత్యావసరాలతో పాటు వంట గ్యాస్ ధరలు పెంచి పేదల బతుకులు దుర్భరంగా మార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 8 నెలల్లో రాష్ట్రంతో పాటు కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో వచ్చి రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని భరోసా ఇచ్చారు.

గిరిజన మహిళలతో కలిసి భోజనం

బూసిమెట్ట క్యాంప్ గిరిజన మహిళలు భట్టి విక్రమార్క కొరకు వంట చేసుకొని తీసుకొచ్చి ఆయనతో కలిసి భోజనం చేశారు. జొన్నరొట్టె, తోటకూర, పెసరుపప్పు, ఉల్లిపాయ, కారంతో కలిపి చేసిన వంటకాలను తీసుకొచ్చి భట్టి విక్రమార్కకు వడ్డించి ఆయనతో పాటు కలిసి భుజించారు. గిరిజన మహిళలు తీసుకొచ్చిన ఈ వంట గురించి పేరు అడిగి తయారీ గురించి తెలుసుకున్నారు. భోజనం ఎంతో రుచికరంగా ఉందని అభినందించారు. యాత్ర విజయవంతానికి కాంగ్రెస్ శ్రేణుల కృషికి భట్టి అభినందనలు తెలిపారు. రెండు రోజుల నుండి మండల, బూత్‌స్థాయి కార్యకర్తలు, నాయకుడు పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయడంతో కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాదయాత్ర కెరమెరి మండలానికి బయల్దేరింది. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ ఎంఎల్సీ ప్రేమ్‌సాగర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, ఆసిఫాబాద్ నియోజకవర్గ నాయకులు సరస్వతి, రాథోడ్ గణేష్, మండలాధ్యక్షుడు ముసిన్, నాయకులు పాల్గొన్నారు.

మంత్రులు రాజీనామా చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీఎస్పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీపై సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై విద్యార్థుల నుండి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆదిలాబాద్ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో అభ్యర్థుల నుండి సంతకాలు సేకరించారు. పేపర్ లీకేజ్ వ్యవహారంపై సిబిఐతో న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. టీఎస్పీఎస్సీ ఘటనకు బాధ్యత వహిస్తూ మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఉమ్డం గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ బడుగు బలహీన వర్గాల ప్రజలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన వారికి పెళ్లి కానుకగా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టి పెద్దన్నగా, మేనమామగా రూ.100116 కానుకగా అందిస్తున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడాలేని పథకాలు కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే అమలు పరుస్తున్న ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. రైతుబంధు, రైతుబీమా, వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు పెన్షన్ అందజేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. రానున్న కాలంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కంది పొచ్చుబాయి నర్సిములు, ఎంపీటీసీ చంటి, మండల కన్వీనర్ తోట వెంకటేష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్, పిఎసిఎస్ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, సర్పంచులు ఆనంద్, రాంబాయి, మహేందర్ యాదవ్, పోతారెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మి నర్సిములు, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీఓ రమకాంత్, పార్టీ నాయకులు మహేష్, గంగాధర్, పోతన్న, రాంచందర్, రాంకిషన్, దేవ్‌రావు, ప్రమోద్ పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌లో యువ ఉగాది వేడుకల్లో జిల్లా విద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన యువ ఉగాది వేడుకల్లో జిల్లా యూత్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా జిల్లాకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ఏర్పాటు చేసిన శోభకృత్ నామ సంవత్సర యువ ఉగాది ఉత్సవాల్లో భాగంగా గవర్నర్ ఆహ్వానం మేరకు జిల్లా విద్యార్థులు సోమవారం సాయంత్రం జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. యూత్ రెడ్ క్రాస్ కమిటీ మెంబర్ విజయబాబు, అసోషియన్ చైర్మెన్ గంగేశ్వర్, యూత్ కోఆర్డినేటర్ విజయ్, సాక్షి శర్మ, జాయిస్ ప్రసన్న, అంజుమ్ వంశీకృష్ణ, ఆకర్ష్ బాబు, విష్ణు, అనుదీప్, నవీన్ యాదవ్ నేతృత్వంలో విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు.

జన చైతన్య యాత్రకు తరలిరావాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఈ నెల 24న కాగజ్‌నగర్‌లో అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించనున్న జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల కృష్ణమాచారి అన్నారు. మంగళవారం మండల కేంద్ర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులతో కలిసి జన చైతన్య పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాలని, మత సామరస్యం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం కోసం పోరాడాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చంద్రశేఖర్, గ్రామ పంచాయతీ కారోబార్‌ల సంఘం గౌరవాధ్యక్షుడు శ్రీకాంత్, అంగన్‌వాడీ నాయకురాలు శ్రీలత, ఆశా, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

దహెగాం : బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో జన చైతన్య యాత్ర వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మతోన్మాదం, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాలన్నారు. మత సామరస్యం, సంక్షేమం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడుదామన్నారు. మార్చి 23 నుండి 29వ తేదీ వరకు సీపీఐ(ఎం) అఖిల భారత కమిటీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్రంలో జన చైతన్య యాత్రలు జరుగుతున్నాయన్నారు. మోడీ, అమిత్‌షా నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్లు కట్టబెడుతూ ప్రజలపై భారాన్ని మోపుతున్నారన్నారు. యావత్ దేశాన్ని అంబానీ, అదానీ సొత్తుగా మార్చారని విమర్శించారు. నూనెలు, వంటగ్యాస్, పెట్రోల్, డీజీల్‌తో సహా అన్ని రకాల సరుకులను అమాంతం పెంచారన్నారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలను చైతన్య పరిచేందుకు ఈ యాత్రలను చేపట్టడం జరిగిందని, ప్రజలందరు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు మెర్వెల్లి అశోక్, మండల కార్యదర్శి సాంబయ్య, నాయకులు దామోదర్, శంకర్, కమల, కిట్టయ్య, అశోక్ పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలోని బంబారా గ్రామంలో సీపీఐ(ఎం) మండల నాయకుడు వినోద్ నాయకత్వంలో మంగళవారం జన చైతన్య యాత్ర పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాలని, మత సామరస్యం, సామాజిక న్యాయం కోసం పోరాడాలని తెలిపారు. మార్చి 23 నుండి 29 వరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్రంలో జన చైతన్య యాత్ర జరుగుతుందని, ప్రజలు, ప్రజాస్వామ్య, లౌకిక వాదులు, మేధావులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

మండలంలోని వివిధ గ్రామాల నుండి కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు రాజేశ్వర్, అల్లప్ప, ప్రకాష్, మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇటీవల కురిసిన వడగళ్ల వానతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు జి ఆనంద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వడగళ్ల వానతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు నష్టపోయారని తెలిపారు. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేసినా ప్రభుత్వం పంటలు నష్టపోకుండా చర్యలు చేపట్టడంలో విఫలమైందని అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ భీమా యోజనతో రైతులు కాస్త ఊరట చెందేవారని, ఆ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడం లేదని అన్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

23న కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఈ నెల 23న మండల కేంద్రంలోని రైతువేదికలో 31 కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేయనున్నట్టు తహసీల్దార్ సరిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 3గంటలకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరై చెక్కులు అందజేస్తారని తెలిపారు.

మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఏప్రిల్ 5న న్యూఢిల్లీలో నిర్వహించే మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్ కోరారు. మంగళవారం ఆయన స్థానిక మున్సిపల్ వాటర్ ట్యాంక్ వద్ద కార్మికుల సమక్షంలో ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, మున్సిపల్ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలని, ఎస్పీఎంలో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఈ శంకర్, ఎ మల్లేష్, పి రమేష్, ఈ శంకరమ్మ, బి రమేష్, అశోక్, శోభ, లక్ష్మి పాల్గొన్నారు.

మొక్కజొన్న, వరి పంటల పరిశీలన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని దరోగపెల్లి గ్రామ శివారులో గల మొక్కజొన్న, వరి పంటలను వ్యవసాయ విస్తరణ అధికారి గౌసియాబేగం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కజొన్నలో కత్తెర పురుగు, వరి పొలాల్లో కాండం తొలుచు పురుగు ఉన్నట్టు గుర్తించారు. కత్తెర పురుగు నివారణకు క్లోరోన్ క్రిమీపోల్ 60 ఎంఎల్ ఎకరానికి, ఆకుముడత నివారణకు ప్రొఫికోనాజాల్ లీటరు నీటికి ఒక మిల్లీమీటర్ చొప్పున కలిపి మొక్కజొన్న పంటకు పిచికారి చేయాలన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాస్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లీటరు నీటికి, అగ్గి తెగులు లక్షణాలు ఉన్నట్టయితే 0.6 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు చంద్రకళ, తిరుపతి, పెంటయ్య, సత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇండ్ల కేటాయింపులో చేతివాటం

- ఒక్కో ఇంటికి రూ.2లక్షల వసూలు
- బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆరోపణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో ప్రజాప్రతినిధులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆరోపించారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణానికి 288 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరైతే ఒక్కో ఇంటికి కౌన్సిలర్లు రూ లక్ష, స్థానిక ఎమ్మెల్యే రూ. లక్ష వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఇళ్ల కేటాయింపులో అర్హులకు అన్యాయం జరిగిందని తాను మున్సిపల్ కార్యాలయం ముందు శాంతియుత ధర్నాకు పిలుపునిస్తే పోలీసులు అతి ఉత్సాహంతో తెల్లవారుజాము నుండే అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాజకీయ ఎదుగుదలకే ఈ నియోజకవర్గంలో పోలీసు శాఖ పని చేస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఎమ్మెల్యే ప్రజాప్రతినిధి మాత్రమేనని, ప్రభుత్వ ప్రతినిధి కాదనే విషయాన్ని పోలీసులు గుర్తుంచుకోవాలని సూచించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో అవినీతి జరిగిందని తాము గత 15 రోజులుగా ఆందోళన చేస్తున్నా కలెక్టర్ స్పందించడం లేదని, కనీసం దీనిపై విచారణ చేయకపోవడం బాధాకరమని అన్నారు. అర్హులకు ఇళ్లు కేటాయించే వరకు తాము ఆందోళన చేపడుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ ఈర్ల విశ్వేశర్‌రావు, నాయకులు కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేష్, చేరాల శ్రీనివాస్, ముత్తు అశోక్, మాచర్ల శ్రీనివాస్, జాడి దీపక్, రాజేందర్ జంజోడ్, సంతోష్ ఠాకూర్ పాల్గొన్నారు.



బాధితులకు పరామర్శ

మున్సిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి వస్తూ పోలీసులకు పట్టుబడి వారి చేతిలో గాయపడ్డ బాధిత మహిళలను మంగళవారం పాల్వాయి హరీష్‌బాబు పరామర్శించారు. స్థానిక నౌగాంబస్తీ, బాలాజీనగర్, విద్యానగర్‌లలో ఆయన పర్యటించి డబుల్ బెడ్ రూం ఇల్లు రాని వారిని కలిశారు. పోలీసుల చేతిలో గాయపడ్డ గుజ్జర్ జ్యోతి తనకు ఇల్లు ఇస్తానని చెప్పి మోసం చేసిన విధానాన్ని వివరించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఎలుకపెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్ హసీన ఆధ్వర్యంలో మంగళవారం పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు తృణధాన్యాలతో వివిధ రకాల వంటకాలను తయారు చేసి వాటి రుచులను చూపించారు. అనంతరం సర్పంచ్ కావ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఇంటిలో పోషకాహారం తీసుకోవాలని, తృణ ధాన్యాల ద్వారా అనేక లాభాలున్నాయని తెలిపారు. వంటలు బాగా తయారు చేసిన మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యుడు తారంపెల్లి మల్లేష్, అంగన్‌వాడీ సిబ్బంది శ్రీలత, చంద్రకళ, పద్మ పాల్గొన్నారు.

వాహనదారులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్‌లు కలిగి ఉండాలి

నవతెలంగాణ-జన్నారం

వాహనదారులు తప్పనిసరిగా ఇన్సూరెన్స్, ఆర్‌సీ, లైసెన్సులు, కలిగి ఉండాలని ఎంవీఐ ప్రత్యూష అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎలాంటి టాక్స్‌లు కట్టని మూడు ట్రాక్టర్లను పట్టుకొని జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నరు. అతివేగం ప్రమాదకరమన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. ప్రతి వాహనదారుడు విధిగా అన్ని రకాల ధ్రువపత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు.

ఘనంగా అంతర్జాతీయ అటవీ దినోత్సవం



నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని కవ్వాల్ టైగర్ రేంజ్ పరిధిలోగల సిరిచెల్మ గ్రామంలో అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని అటవీ శాఖ అధికారులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ రేంజ్ అధికారి వాహబ్ అహ్మద్ మాట్లాడుతూ మానవ మనుగడకు అటవీ సంపాదన ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. అడవిని, వన్య ప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ ఉపక్షేత్ర అధికారి గీరయ్య, సెక్షన్ ఆఫీసర్ వసంత్ కుమార్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : మానవ మనుగడలో అడవుల పాత్ర ఎంతో కీలకమైందని జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, ఎఫ్ఆర్ఓ పాండురంగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అటవీ శాఖ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ అభివృద్ధికి అడవులు ఎంతో అవసరమని తెలియజేయడమే ప్రపంచ అటవీ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అడవులను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అడవులను నరికి వేస్తే భవిష్యత్ కాలంలో దుష్పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి అడవులను కాపాడుకోవాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల్లో అవగాహన పెరగటం చాలా అవసరమని, తద్వారా వారు మిగతా సమాజానికి సంధానకర్తల్లా పనిచేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో చౌహాన్ రాధ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యూష, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వెంకటేష్, ఫారెస్ట్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ పోలీసుల కృషి

నవతెలంగాణ-తాండూర్

శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు వ్యవస్థ కృషి చేస్తోందని తాండూర్ సీఐ జగదీష్ కుమార్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ఐకమత్యంతో సోదరా భావంతో కలిసిమెలిసి పండగలు నిర్వహించుకోవాలన్నారు. శాంతి భద్రతలకు విగాతం కల్గకుండా సామరస్యంగా నిర్వహించుకోవాలని పోలీసుల సహకారం ఉంటుందన్నారు. పండగ సమయాలల్లో వ్యక్తులు ఏ ఇతర మతస్తుల శాంటి భద్రతలు విగాతం కలిగించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

కొనసాగుతున్న పోషణ పక్షోత్సవాలు



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం రెండో రోజు పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణ పక్షంలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు గర్భిణీ బాలింతలకు ఇచ్చే చిరుధాన్యాలు భర్తలకు, అత్త మామలకు వంటకాల పోటీలు నిర్వహించారు. అనంతరం వారికి ముఖ్యంగా చిరుధాన్యాలు వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ద్వారా 15 రోజుల పాటు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీఓ ఉమా, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ అబ్దుల్, డీఖీ ఎన్ఈజీడీ ఆఫీసర్ నాగలక్ష్మి, ఇన్‌ఛార్జి సీడీపీఓ ఉమా, సూపర్ వైజర్లు వందన, లక్ష్మి, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండలంలోని అంగన్‌వాడీ పాఠశాలలలో మంగళవారం పోషణ పక్షం కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులకు, గర్భిణీలకు, బాలింత తల్లులకు పోషక ఆహారం ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రతీ అంగన్‌వాడీలో చిరుధాన్యాలతో చేసిన ఆహారాన్ని అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి తెలిపారు. అనంతరం చిన్నారులతో కలిసి సిబ్బంది ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు.

ఆదిలాబాద్ అర్బన్ : ఆరోగ్య తెలంగాణ కోసమే పోషణ పక్షం నిర్వహిస్తున్నట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లంక అన్నపూర్ణ అన్నారు. మంగళవారం మేడిగూడ, సైద్‌పూర్ సెక్టార్లకు చెందిన మారుగూడ, తోయగూడ గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో గ్రామస్తులకు పోషక విలువల పట్ల అవగాహన కల్పించారు. ఈ పోషణ పక్షం ఏప్రిల్ 3 వరకు కొనసాగుతుందని పోషణ లోపంలేని గ్రామాలను తయారు చేయడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. చిరుధాన్యాల్లో వరిగలు, అరికలు, వరి, జొన్న, రాగులు, కొర్రలు, గోధుమ, సజ్జలు, సామలు లాంటి వాటిలో ఉన్న పోషణ విలువల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీరామ్, చరణ్, ఉప సర్పంచ్ ప్రమోద్, అంగన్‌వాడీ టీచర్లు వెంకటమ్మ పద్మ, ముక్త, అడెల్లి, ఆయాలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

బోథ్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చోడ, బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, మండలాలకు సంబంధించిన కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ కింద రూ.కోటి 40 లక్షల చెక్కులను అందజేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ రుక్మాన్ సింగ్, వైస్ చైర్మెన్ సంజీవరెడ్డి, జెడ్పీటీసీ సంధ్యారాణి, నేరడిగొండ ఎంపీపీ సజన్, స్థానిక సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు లింబాజీ, తాహెర్, జగన్ మోహన్‌రెడ్డి, ఎలుక రాజు, మల్లెపూల సుభాష్, నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రపంచ నీటి దినోత్సవం

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ప్రపంచ నీటి దినోత్సవం 2023ను పురస్కరించుకొని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఏ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ నీరే జీవనం, నీటిని సంరక్షించడం, భావితరాలకు నీటి కొరత రాకుండా చేయడం మన బాధ్యత అన్నారు. ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలు, నీరు కాలుష్యం కాకుండా చేపట్టిన చర్యలని విద్యార్థులకు వివరించారు. ఆచార్యులు ఏ శ్రీనివాస్ మాట్లాడుతూ నీటి నుంచి జీవం పుట్టిందని, నీటి పరివాహ ప్రాంతాల్లోనే జీవుల మనుగడ సాగిందని అన్నారు. అరప్ప మొహంజోదారో నాగరికతలు నది పరివాహ ప్రాంతాల్లో వెలిశాయని తెలియజేశారు. అనంతరం నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో ప్రథమ బహుమతి ఏ వర్దన్, ద్వితీయ బహుమతి మిస్బా మహీం, తృతీయ బహుమతి బి జయ గెలుపొందారు. వీరికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు కె.రఘునాథ్, ఏ.జ్యోత్స్న, సలీహ, ఆఫ్రిన్, వెంకటేష్, రాజశేఖర్, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలి

- ఆదివాసీ తుడుందెబ్బ విద్యార్థి సంఘం నాయకులు పెందూర్ దాదిరావ్ డిమాండ్



నవతెలంగాణ-నార్నూర్

కెరమెరి మండలం అగర్వాడ గ్రామానికి చెందిన జగ్నాక రేణుక బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి న్యాయం చేయాలని ఆదివాసీ తుడుం దెబ్బ విద్యార్థి సంఘం నాయకులు పెందూర్ దాదిరావ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆదివాసీ తుడుందెబ్బ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెరమెరి మండలం అగర్వాడ గ్రామానికి చెందిన జగ్నాక రేణుక గత రెండురోజుల కింద నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రయివేటు ఆస్పత్రిలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న క్రమంలో లంబాడి తెగకు చెందిన లావుడ్యా రమేష్ అనే వ్యక్తి మాయ మాటలు చెప్పి ప్రేమలో దింపి ఎవరికి తెలువకుండా సహజీవనం చేసి ఆమెను గర్భిణీని చేసి డెలివరీ అయ్యే సమయంలో ఆమెను చిత్ర హింసలు చేయడంతో ఆమె చనిపోవడం జరిగిందన్నారు. అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు సుర్పం నాగోరావ్, జుగ్నాక కృష్ణ, మడావి ఆనంద్‌రావు, పెందూర్ సంతోష్, నైతం సోనేరావ్, ఆత్రం బాపురావు పాల్గొన్నారు.

వీబీఏ నూతన పట్టణ కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

వంచిత్ బహుజన్ అఘాడి పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్య వంశీ విద్యాసాగర్ అధ్యక్షతన స్థానిక రణదివేనగర్‌లో మంగళవారం ఆ పార్టీ నూతన పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులుగా సిద్ధార్థ్ ధన్వాంత్ ఉపాధ్యక్షులుగా ఎండీ. నుజర్ ఖాద్రి, దీపంకర్ దాబడే, సెక్రటరీగా ప్రకాష్ యాసంకర్, ప్రధాన కార్యదర్శిగా దమ్మ కీర్తి వాగ్మారెలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన నాయకులు మాట్లాడుతూ ఆదిలాబాద్‌లోని అన్ని వార్డుల కమిటీలు పూర్తయిన సందర్భంగా ఇకపై వార్డు అధ్యక్షులు తమ వార్డులలో పార్టీ ప్రచార కార్యక్రమాలు, పార్టీ జాయినింగ్ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుని నియామకం ఇంకా జరగనందున రానున్న ఎన్నికల దృష్ట్యా వెంటనే ఆ పార్టీ జిల్లా అధ్యక్షులను నియమించాలని ఉమ్మడి జిల్లా బాధ్యులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆగాడి పట్టణ మహిళా అధ్యక్షురాలు వైశాలి భాయి యాసంకర్, పార్టీ నాయకులు ప్రీతి బాయి, జమునాబాయి, నిఖిల్ కాంబ్లే, నగేష్, నవేద, షేక్ నజీమ్, షేక్ మోసిన్, షేక్ అబిద్, రవి, బండారి అమర్, విజయ్ కందారే, సూరజ్ పాల్గొన్నారు.

న్యాయవాది రమేష్‌ను సన్మానించిన అభ్యర్థులు



నవతెలంగాణ-తలమడుగు

జేఎల్ పేపర్-2 తెలుగు మాధ్యమంలోనే పెట్టాలని టీఎస్పీఎస్సీని ఆదేశిస్తూ తీర్పునిచ్చిన హైకోర్టు న్యాయమూర్తి బూర రమేష్‌ను ఓయూ జేఏసీ అధ్యక్షులు ఎల్లల దత్తాత్రేయ మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ ఇది నిరుద్యోగుల విజయమని తెలిపారు. జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి అభ్యర్థుల వడపోతలో భాగంగా ప్రశ్న పత్రం ఆంగ్లంలో మాత్రమే ఇస్తే ఆర్థిక, సామాజిక కారణాల వల్ల తెలుగులో పీజీ చేసిన అభ్యర్థులు ఆంగ్ల అభ్యర్థులతో పోటీపడలేరని తెలిపారు. తెలుగు మాధ్యమంలో చదువుకున్న అభ్యర్థి ప్రశ్నను భిన్నంగా అర్థం చేసుకుంటే అది ఉద్యోగావకాశంపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో లెక్చరర్ పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించే రాత పరీక్షల్లో రెండో పేపర్ ప్రశ్నపత్రాన్ని తెలుగు, ఆంగ్ల భాషల్లో ఇవ్వాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ)ని ఆదేశిస్తూ సోమవారం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. రెండు భాషల్లో ప్రశ్నపత్రం ఇవ్వాలి ఇష్టానుసారం పరీక్షల నిర్వహణ సరికాదని, జూనియర్ లెక్చరర్ పోస్టుల పరీక్షలపై టీఎస్పీఎస్సీకి ఆదేశం, కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పేపర్-2 ప్రశ్నపత్రం కేవలం ఆంగ్లం మాధ్యమంలోనే ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఆదిలాబాద్‌కు చెందిన ఓయూ జేఏసీ అధ్యక్షుడు ఎల్లల దత్తాత్రేయ తన మిత్రుడు విజయ్ కుమార్ ద్వారా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును హైకోర్టు సీనియర్ అడ్వొకేట్ బూర రమేష్ వాదించారు. దీనిపై సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శరత్ తీర్పునిచ్చారు. రాష్ట్రంలో తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ప్రభుత్వ కళాశాలలున్నాయని, రెండు భాషల్లో ప్రశ్నపత్రం ఇవ్వాలని కేసును వాదించి విజయం సాధించిన అడ్వొకేట్ బూర రమేష్‌ను కేసు వేసిన ఓయూ జేఏసీ అధ్యక్షుడు ఎల్లల దత్తాత్రేయను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద ఘనంగా సన్మానించి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో నిరంజన్ యాదవ్, సత్యపాల్, వంశీ, రఘు, తిరుపతి, వెంకటేష్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో అవార్డులు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి 11 అవార్డులు పొందినట్లు ఎంపీడీఓ మోహన్ తెలిపారు. జాతీయ స్థాయిలో వివిధ విభాగాల్లో రాణించిన ఆయా గ్రామ సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులకు అభినందనలు తెలియజేశారు. పొట్టపెల్లి(కె) గ్రామానికి అత్యధికంగా 11 అవార్డ్స్ అందినట్లు ఎంపీడీఓ తెలిపారు. గురువారం 23 తేదీన 12 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రశంస పత్రాలు అందజేయడం జరుగుతుందని అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.



మద్యం దుకాణాన్ని తరలించండి

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని నివాస ప్రాంతంలోని మద్యం దుకాణాన్ని వెంటనే అక్కడ నుండి తరలించాలంటూ కాలనీవాసులు జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మద్యం దుకాణం ముందు ఇండ్లు ఉండటంతో మందు బాబులు మద్యం మత్తులో ఉండటంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. వెంటనే మద్యం దుకాణాన్ని గ్రామ పొలిమేరలో ఉంచాలని తెలిపారు. గతంలో అనేకసార్లు ఈ విషయంపై వైన్స్‌షాపు యజమానులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోలేదని అన్నారు. మద్యం దుకాణాన్ని వెంటనే తరలించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో దత్తు, వెంకట్ రెడ్డి ఉన్నారు.

ఆకట్టుకున్న ఫొటో ప్రదర్శన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పశుపక్షాదులు, వన్యప్రాణులు అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఫోటో ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఎన్నో పక్షులు, వన్యప్రాణులు, అడవిలోని వింతలు, విశేషాలకు సంబంధించిన చిత్రాలు విద్యార్థులను అలరింపజేశాయి. వాటి గురించి తెలుసుకునేందుకు విద్యార్థులు ఉత్సాహం కనబర్చారు. వాటిని గురించి లింగంపల్లి కృష్ణ సవివరంగా వివరించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సదస్సుకు చేయూత

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఈనెల 24న నిర్వహించనున్న తెలంగాణ ఆల్ పెన్షన్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ మూడవ జిల్లా మహాసభలకు దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్ తన వంతుగా రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందచేయడానికి ముందుకొచ్చినట్టు పేర్కొన్నారు. స్థానిక పీఆర్టీయూ సంఘ భవనంలో జరగనున్న మహాసభలకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మచ్చ రంగయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సీతారామయ్య పాల్గొననున్న నేపథ్యంలో సభకు హాజరయ్యే రిటైర్డ్ ఉద్యోగులకు తనవంతుగా రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు సాయిరి శశికాంత్, దుర్గం ట్రస్ట్ సభ్యులు మాదస్తు మహేందర్, కావేటి మోహన్ యాదవ్, ఆడే రఘునాథ్, మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ చైర్మెన్ మాసం అనిల్ కుమార్, దేవన్న, శ్రీనివాస్, గణేష్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు ఎంపికైన జిల్లా విద్యార్థిని

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతిష్టాత్మకమైన కోరుకొండ సైనిక్ స్కూల్ (ఆల్ ఇండియా సైనిక్ స్కూల్)లో తెలంగాణ రాష్ట్రానికి ఉన్న ఒకే ఒక్క సీటును ఆదిలాబాద్ జిల్లా ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్ వేణు కుమార్తె వాహినికి రావడం గర్వకారణమని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. ఈమేరకు పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి విద్యార్థిని వాహినిని ఆహ్వానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పోలీస్ ముఖ్య కార్యాలయం ఏఓ యూనిస్ అలీ, ఏఆర్ అడ్మిన్ డి వెంకటి, సీసీ దుర్గం శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సభ్యులు గిన్నెల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉగాది భరోసా

శిశిరం చిగురాకులేసి
వసంతానికి వన్నెలద్ది
విరహపు వరమాల చేబూని
కోయిల కుహు కుహూ యంటూ
వసంత గీతమౌతున్న వేళ


గిరిగళసీమనలంకరించిన
ఇప్పగోగు రేల పూగుత్తులు
సువాసనలు వెదజల్లు అగరత్తులు
చిమ్మటల, తుమ్మెదల ఝుంకారనాదాలు
సెలయేటి సవ్వడుల సుజల స్వరాలు
నీరాకకై పలుకు స్వాగత గీతాలు

పసిడి కిరణాల పాడ్యమి ఉషోదయాన
చైత్రరథముపై ఊరేగుతూవస్తున్న
శోభాకృతుణ్ణి, ఉగాది వెంటేసుకొని
వస్తున్న శుభసమయాన
పుడమి ఎదపైనాగలి కర్రుమోప
నరాతనోత్సాహంతో రైతన్నలు కదిలే
శోభాశుభ గడియ యిది

ఋతువుల రాణి వసంత మిప్పుడు
చిగురాకు చీరెతో సింగారించుకొని
జడనిండా నక్షత్రరాసులు తురుముకొని
చిగురు మామిడి పిందెలతో
తాటి ముంజల కమ్మదనంతో
తునికి పండ్ల తీయదనంతో
పూత ముసుగేసుకున్న యాపతోకూడి
నీ రాకకు హారతిచ్చువేళ

పూజకోసం పొలంకాడి కొచ్చే ఆసామి
ఆరుకోడానికి తెచ్చిన, కొత్త కామగొడ్డలి
కోటి ఆశలు రేపుతున్నది.

భూమాతను పూజించి ప్రణమిల్లి
రైతు బతుకు మూడు పువ్వులారుకాయలు
కాకున్నా!
పూసిన ప్రతి పువ్వు కాయైతే
మంచిగుండంటున్నడు.
పట్టిందల్లా బంగారం గాకున్నా!
ఆలితాళి తెగకుండా సూడమంటున్నడు.
పంచాంగపు బలాలబలాలు విప్పి
రాజపూజ్యం లేకున్నా!
మానావమానాలు లేకుండా
జూడమంటున్నడు.
ఆవుసు దీసే రోగాలు అంటకుండా
కాపాడమంటున్నడు.
ఉగాదులెన్ని వచ్చిపోతున్నా!
ఆశవడి గోసవడ్డరైతు
రాజెప్పుడైతడోనని
రాజ్యం ప్రతియేడు
కంట్లో వత్తులేసుకొని ఎదురు
చూస్తూనేయున్నది.
కాని, ప్రతియేడు కానికాలమొచ్చిందని
కథలే చెబుతున్నది.
కథల వెతలుదీరి కాలానికి ఎదురీది
కష్టానికే కష్టమొచ్చే రోజురావాలి
పాడిపంటలు ధనరాసులతో రైతువాకిళ్ళు
నిండిపోవాలి
ప్రతిఇంటా ధాన్యలక్ష్మీ కటాక్షమవ్వాలి.
శోభాకృత నామధేయా!
నిండు పండుగ శోభను నింపుకొని
నిత్యరైతు బాంధవుడవుతావని
బాసజేస్తూ భవిష్యత్తుకు బంగారు శాలువా
కప్పి
భావిజీవితానికి భరోసా నిచ్చేవా!!



చిందం ఆశన్న
తెలుగు
ఉపన్యాసకులు
ఆదిలాబాద్

ప్రజాప్రతినిధుల మాటలు నీటి మూటలు

నవతెలంగాణ-బోథ్



ప్రజా ప్రతినిధుల మాటలు నీటి మూటలుగా మిగిలిపోతున్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతుల పంటలు శనగ, గోధుమ, ధనియాలు, మొక్కజొన్న, జొన్న, నువ్వులు, అధిక వర్షంతో పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. అలాగే అదిలాబాద్ జిల్లా కలెక్టర్‌కు రైతులకు ఆదుకోవాలని కోరారు. ప్రజా ప్రతినిధుల మీద నమ్మకం లేదని వాపోయారు. అలాగే ఖరీఫ్ సీజన్‌లో జరిగిన పంట నష్ట వివరాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లా కలెక్టర్ స్పందించి అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగానికి రైతు యూనిట్ గా ఏర్పాటు చేసి నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే పంట నష్టపోయిన రైతులకు పంట రుణాలను రీ షెడ్యూల్ చేసి లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి పంటలకు దిగుబడి వ్యాయానికి అదనంగా 25శాతం కలిపి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం లేఖను ట్విట్టర్ ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కుర్మే మహేందర్, నాయకులు గుడాల శేఖర్, రాజశేఖర్, బొడ్డు గంగారెడ్డి, బత్తుల రమేష్, చెట్లపల్లి అనిల్, పాల్గొన్నారు.

మహిళ మెడలోంచి గొలుసు దొంగతనం

- **స్కూటీపై వెళ్తుండగా ఘటన**

ఆదిలాబాద్‌టౌన్: ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తి బంగారు గొలుసు లాక్కొని వెళ్లిన ఘటన మంగళవారం తెల్లవారుజామున అదిలాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వన్ టౌన్ పట్టణ ఎస్సై జి.నారాయణరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన మడవి గంగుభాయి ఉదయం 5 గంటల ప్రాంతంలో స్కూటీపై బస్టాండ్ వైపు ఓ పని మీద వెళ్లి ఇంటికి వెళ్తున్న క్రమంలో కలెక్టర్ చౌక్ ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కలెక్టర్ చౌక్ ప్రాంతంలో వెళ్తుండగా వెనక నుండి హెల్మెట్ పెట్టుకొని వచ్చిన గుర్తు తెలియని ఓ ద్విచక్ర వాహనదారుడు ఆమెను నెట్టేసి మెడలో నుంచి గోలుసును లాక్కెళ్లాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న మార్నింగ్ వాకర్స్ చూసి అతన్ని పట్టుకోవడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఆమెను నెట్టేయగా కింద పడటంతో స్వల్పంగా గాయాలయ్యాయి. దీంతో బాధితురాలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేపడతామని తెలిపారు. గొలుసు రెండు తులాల బంగారం వాటి విలువ రూ.75 వేల వరకు ఉంటుందని బాధితురాలు తెలిపింది.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

అకాల వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలనీ సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా జిల్లా నాయకులు జగన్ సింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుండి కురుస్తున్న వడగండ్ల వానలకు, గాలులకు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో మిరప, మొక్కజొన్న, మామిడి, టమాటా, మొక్కజొన్న బాగా దెబ్బతిన్నాయని అన్నారు. ఈ నష్టాన్ని అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి, నష్టపోయిన రైతులకు పట్టాదారులతో నిమిత్తం లేకుండా సాగుచేసిన రైతులకు నేరుగా నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇండ్లు కూలిపోయిన కుటుంబాలకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేసి, నిర్మాణానికి ఒక్కో ఇంటికి ఐదు లక్షల చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోపీచంద్, గోడకే మధుకర్, ఉత్తం నితిన్, ఆత్రం వినోద్, రఫీక్ పాల్గొన్నారు.


ఏజెన్సీ దళితుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ - జైనూర్

ఏజెన్సీ దళితుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా అసెంబ్లీలో చర్చించాలని ఏజెన్సీ షెడ్యూల్ కులాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు సుద్దాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలో కొనసాగిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలో దళితులు దళిత సంఘం నాయకులతో కలిసి సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు ఏజెన్సీ ప్రాంతంలోని దళితుల పరిస్థితిపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న షెడ్యూల్ కులాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలో షెడ్యూల్ కులాలకు చెందిన వారు ఏండ్ల నుండి నివసిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారిన ఏజెన్సీ ప్రాంతంలో దళితుల పరిస్థితి మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమక్రమంగా హక్కులు కోల్పోతున్నామని తెలిపారు. రాజ్యాంగంలో పొందుపర్చిన 15 శాతం రిజర్వేషన్‌కు కూడా నోచుకోవడం లేదన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అనేక విషయాల్లో హక్కులు కోల్పోతున్నట్టు తెలిపారు. రైతుబంధు లాంటి పథకాలను దళితులకు అందించడం లేదని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న ఎస్సీలకు విద్య, వైద్యం, రాజకీయ రంగంలో రిజర్వేషన్ కల్పించేలా అసెంబ్లీలో చర్చించాలని కోరారు. బ్యాంకు రుణాలతో పాటు కార్పొరేషన్ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు ఎస్సీలకు ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు మొహాలె దత్త, శివానంద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నవతెలంగాణ-దిలావర్‌పూర్



నర్సాపూర్(జి) మండలంలోని అంజనితండ గ్రామానికి చెందిన రాథోడ్ రామకృష్ణ(24) యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఏఎస్సై మాన్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం తన స్వంత పనుల నిమిత్తం ఎపీ01.ఏఈ.9686 నెంబరు గల బైక్‌పై నర్సాపూర్(జి) గ్రామానికి వచ్చి, పని ముగించుకుని వెళుతుండగా తిరుగు ప్రయాణంలో రాత్రి 10 గంటల సమయంలో మార్గమధ్యంలో బైక్ అదుపుతప్పి రోడ్డు ప్రక్కన గల చెట్టును బలంగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి, బైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించాడు. అతివేగంతో, అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మృతుని అన్న రాథోడ్ ఆజేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టామని ఏఎస్సై తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-బాసర

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ నారాయణ హెచ్చరించారు. మంగళవారం అక్రమంగా వే బిల్లులు లేకుండా నిజామాబాద్ నుండి బాసరకు ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి జరిమానా విధించి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బీసీ సంఘ నాయకులు

నవతెలంగాణ-తలమడుగు

మండల బీసీ సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన మేకల రవికాంత్ యాదవ్, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన మేకల వెంకన్న, మంగళవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీసీ సంఘ నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తలమడుగు సర్పంచ్ కళ్లెం కరుణాకర్‌రెడ్డి, బోథ్ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సేవాలాల్ భక్తులు కల్పన పాదయాత్ర విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఉగాది రోజున ప్రారంభం కానున్న బంజారాల సేవాలాల్ భక్తుల కల్పన పాదయాత్ర విజయవంతం చేయాలని బంజారా యువసేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ సంజీవ్ నాయక్ తెలిపారు. ఈనెల 22 ఉగాది రోజున ఆసిఫాబాద్ జిల్లా శంకర్ లోద్ధిలో యాత్ర ప్రారంభమై రామ నవమి రోజున బంజరాల కాశీ పౌరదేవిలో యాత్ర ముగిస్తుందని తెలిపారు. కొత్తపల్లి దీక్ష భూమి పిఠాధిపతి ప్రేమ్‌సింగ్ మహారాజ్ పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జాదవ్ శేషరావ్ నాయక్, రాథోడ్ దుదారాం, బంజారా యువసేన నాయకుడు జాదవ్ రాజు, ఆడే గజానంద్, జాదవ్ విగ్నేష్ ఉన్నారు.

సీఎల్పీ నేత పాదయాత్ర విజయవంతం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆదిలాబాద్ జిల్లాలో చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రను విజయవంతం చేసినందుకు జిల్లా కాంగ్రెస్ కమిటీ తరపున ప్రతి ఒక కాంగ్రెస్ కార్యకర్తకు, నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర దారిపొడవునా జిల్లాలోని సమస్యలను ఏకరువు పెడుతూ పరిష్కరించే విధంగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మారుమూల గ్రామాల గుండా తన పీపుల్స్ మార్చ్ పాదయాత్రను ఎంచుకోవడం జరిగిందన్నారు. ప్రతిపక్ష నేతగా ఆదిలాబాద్ జిల్లాలు గిరిజనులు, గిరిజనేతరులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు, రైతు కార్మికులు, అందరూ తమ సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వంపైన అసెంబ్లీలో మాట్లాడాల్సిందిగా తమ గోడును సీఎల్పీ నేతభట్టి విక్రమార్క వద్ద వెల్లబోసుకున్నారని అన్నారు. భగవంతుడి కృపతో భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర నిర్విఘ్నంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

పట్టణంలో చలి వేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తి తీర్చేందుకు వైదిక పురోహిత అర్చక బ్రాహ్మణ సంఘం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం తిర్పెల్లి రాంమందిర్ ఎదుట చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సంతోష్ కుమార్ శర్మ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం చలి వేంద్రం ప్రారంభించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాధాకృష్ణ శాస్త్రి, సహాయ కార్యదర్శి కిషోర్, గుండయ్యా, ఆది నారాయణ, ప్రదీప్ వ్యాస్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 611 మంది గైర్హాజరు

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం సెకండియర్ పరీక్ష గణితం, బాటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలు నిర్వహించగా 611 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ రవీందర కుమార్ తెలిపారు. జనరల్ విభాగంలో 8,517 మందికి గాను 462 మంది గైర్హాజరు కాగా, 8055 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 907కు గాను 149 మంది హాజరైనట్లు వివరించారు. జిల్లా కేంద్రంలో పలు పరీక్ష కేంద్రాలను డీఐఈఓ తనిఖీ చేశారు.